RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

శ్రీ ప్రస్థానం
మన దేశం..మన హక్కు
తెలుగు దినపత్రిక

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**

సంప్రదించవలసిన నంబర్లు

**94916 28386     85220 22029**

**Land Line No : 08517 224194**

కర్నూలు సంపుటి : 03 సంచిక : 340     శనివారం 16-03-2024     పేజీలు :04     వెల:రూ.2.00

## పిఠాపురం లో పవన్ కళ్యాణ్ పై వైసీపీ అభ్యర్థి గా పోటీ చేయనున్న వంగా గీత.

### పిఠాపురం భాద్యతలను ఎంపీ మిథున్ రెడ్డి అప్పజెప్పిన సీఎం జగన్‌చ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా వంగా గీత



అనంతపురం నగరంలోని సత్య సాయి జిల్లా టిడిపి అధ్యక్షుడు బి.కె పార్థసారథి ఇంటి వద్ద ధర్మవరం తెలుగుదేశం పార్టీ నాయకులు ఆందోళనధర్మవరం నియోజకవర్గ టిడిపి టికెట్ పరిటాల శ్రీరామ్ కే కేటాయించాలంటూ నిరసన చేపట్టిన ధర్మవరం తెలుగుదేశం పార్టీ నాయకులు రేపు మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రెస్ మీట్.ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనున్న ఈసీలోక్‌సభతో పాటు ఐదు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనున్న సీఈసీలోక్‌సభతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిషా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాలకు ఎన్నికలు

# వైసీపీలో చేరిన ముద్రగడ



విజయవాడ, మార్చి 15 ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం ఉదయం తాడేపల్లిలోని క్యాంప్ ఆఫీస్ లో సీఎం జగన్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముద్రగడతో పాటు ఆయన తనయుడు గిరి కూడా వైసీపీలో చేరారు. ఇటీవల రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన ఏ పార్టీలో చేరతారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ముద్రగడ తొలుత జనసేనలో చేరుతారని భావించినా అలా జరగలేదు. అనంతరం సీఎం ఆదేశాలతో వైసీపీ నేతలు ఆయన్ను కలిసి స్వయంగా పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో వైసీపీలో చేరి సీఎం జగన్ తరఫున ప్రచారం చేస్తానని ముద్రగడ ప్రకటించారు. ఈ క్రమంలో అధికారికంగా శుక్రవారం వైసీపీ కండువా కప్పుకొన్నారు. వైసీపీలో చేరడం సంతోషంగా ఉందని ముద్రగడ పేర్కొన్నారు.కాపు ఉద్యమ నేతగా గుర్తింపు పొందిన ముద్రగడ పద్మనాభం ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 1978లో జనతా పార్టీ నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన.. 1983, 1985లో టీడీపీ తరఫున బరిలో నిలిచి విజయం సాధించారు. 1989లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందారు. 1994లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ముద్రగడ కుటుంబం ఆరుసార్లు గెలిచింది. ఎన్టీఆర్, చెన్నారెడ్డి మంత్రివర్గాల్లో పని చేశారు. 1999లో టీడీపీ తరఫున ఎంపీగా పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత 2009లో కాంగ్రెస్ తరఫున పిఠాపురం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అప్పటి నుంచి ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్న ఆయన.. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాపు రిజర్వేషన్ల కోసం ఉద్యమించారు. ఇటీవల రాజకీయ పరిణామాల నేపథ్యంలో ముందు వైసీపీలో చేరుతాననే ప్రకటన చేస్తారని భావించినా అలా జరగలేదు. తర్వాత వైసీపీలో చేరేది లేదని.. జనసేనలో చేరుతానని ప్రకటించారు. అనంతరం జనసేన నేతలు ఆయనతో భేటీ అయ్యారు. స్వయంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముద్రగడ ఇంటికి వచ్చి పార్టీలోకి ఆహ్వానిస్తారనే ప్రచారం సాగింది. అలా జరగకపోవడంతో ముద్రగడ అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వైసీపీ నేతలతో చర్చల అనంతరం ఆ పార్టీ వైపే మొగ్గు చూపారు. ఈ క్రమంలో సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఆయనకు.. కాపు సామాజికవర్గం ఎక్కువగా ఉండే నియోజకవర్గాల్లో ప్రచార బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అటు, ముద్రగడ కుమారుడు గిరిబాబుకు నామినేటెడ్ పదవి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ నెల 14వ తేదీనే తన అనుచరులతో సహా సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరుతానని ముద్రగడ ప్రకటించారు. ఇందు కోసం ఏర్పాట్లు చేసుకున్నారు. 'అధిక సంఖ్యలో అనుచరులు వాహనాల్లో తరలి రండి, ఎవరి భోజనాలు వారే తెచ్చుకోండి' అంటూ ఓ బహిరంగ లేఖ కూడా రాశారు. కిర్లంపూడి నుంచి తాడేపల్లి వరకు భారీ ర్యాలీ చేపట్టి అనంతరం సీఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరాలని అనుకున్నా ఆ నిర్ణయాన్ని విరమించుకున్నారు. శుక్రవారం ఒక్కరే వెళ్లి సీఎం సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు.

# నేడు మోగనున్న ఎన్నికల నగారా




### షెడ్యూల్ విడుదల చేసేందుకు రంగం సిద్ధం
### నేటి మధ్యాహ్నం మీడియా సమావేశంలో ప్రకటన
### షెడ్యూల్ వివరాలను వెల్లడించనున్న ఎన్నికల కమిషనర్లు

న్యూఢిల్లీ,మార్చి15:సార్వత్రిక ఎన్నికల ప్రకటనకు రంగం సిద్ధం అయ్యింది. పార్లమెంటుతో పాటు పలు రాష్ట్రాల్లో ఎన్నికలు జరిపేందుకు ఎన్నికల కమిషన్ సిద్ధంగ ఆఉంది. ఈ మేరకు 16న శనివారం ఎన్నికల నగారా మోగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర ఎన్నికల సంఘం మీడియా సమావేశం నిర్వహించి షెడ్యూల్‌ను ప్రకటించనుంది. ఈ మేరకు ఈసీ నేడు సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడించింది. లోక్‌సభతో పాటుగానే.. ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా పోలింగ్ తేదీలను ప్రకటించనున్నారు. ప్రస్తుత లోక్‌సభకు జూన్ 16వ తేదీతో గడువు ముగియనుంది. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీలకు ఈ ఏడాది మేలోగా ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇందుకోసం ఇటీవల దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో పర్యటించిన ఈసీ.. స్థానిక రాజకీయ పార్టీలు, క్షేత్రస్థాయిలో అధికారులతో విస్తృత సమావేశాలు నిర్వహించింది. అనంతరం షెడ్యూల్‌ను సిద్ధం చేసింది.గత లోక్‌సభ ఎన్నికలకు 2019 మార్చి 10న షెడ్యూల్‌ను ప్రకటించారు. ఏప్రిల్ 11 నుంచి మే 19వ తేదీ వరకు ఏడు దశల్లో పోలింగ్ జరిగింది. మే 23న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించారు. ఈసారి కూడా ఏప్రిల్-మే నెలల్లోనే ఎన్నికలు నిర్వహించేలా ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. షెడ్యూల్ ప్రకటించగానే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. ఈ క్రమంలో దేశ వ్యాప్తంగా ఎన్నికల నగారా మోగించేందుకు ఎన్నికల కమిషన్ సిద్ధమైంది. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు సీఈసీ ప్రెస్ మీట్ నిర్వహించనుంది. ఈ మీడియా సమావేశంలో లోక్ సభ ఎన్నికలతో పాటు ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ను విడుదల చేయనుంది. ఏపీ, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఈసీ భావిస్తోంది. వీటితో పాటు జమ్మూ కశ్మీర్ లో కూడా అసెంబ్లీ ఎన్నికలకు ఈసీ షెడ్యూ సిద్ధం చేస్తుంది. ఎన్నికలు ఏప్రిల్, మే నెలలో జరగనున్నాయని ప్రచారం జరుగుతుంది. గతంలో 2019 ఎన్నికలు ఏప్రిల్, మే నెలలో నిర్వహించారు అధికారులు. ఇప్పుడు కూడా మునపటి విధానాన్నే ఫాలో అవుతారని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి తండ్రి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఏపీ మంత్రి బుగ్గన



నంద్యాల జిల్లా రాజకీయ సంచలనం జరిగింది. ప్యాపిలిలో మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి విగ్రహాన్ని ఏపీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆవిష్కరించడం సంచలనంగా మారింది.వాస్తవంగా ప్యాపిలిలో కోట్ల విజయభాస్కర్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించాలని 12 ఏళ్ల క్రితమే కమతం భాస్కర్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పటినుంచి ఇప్పటివరకు కోట్ల విగ్రహం ఆవిష్కరణకు నోచుకోలేదు. విగ్రహానికి బట్ట చుట్టి మూసేశారు. ప్రస్తుత ఎన్నికలవేళ విగ్రహం గురించి చర్చ జరిగింది.ప్రస్తుతం డోన్ నుంచి కోట్ల విజయభాస్కర్ రెడ్డి తనయుడు కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి తెలుగు దేశం పార్టీ తరఫున బరిలోకి దిగుతున్నారు. అతనికి పోటీగా రాష్ట్ర మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వైసీపీ తరఫున తలపడుతున్నారు. వాస్తవంగా సూర్య ప్రకాష్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలోనే విగ్రహ ఏర్పాటు చేశారు. ఎందుకో కానీ ఇప్పటివరకు ఆవిష్కరణకు నోచుకోలేదు. అయితే తాజాగా తనతో అసెంబ్లీ ఎన్నికల్లో తలపడపోతున్న ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి అయిన కోట్ల సూర్య ప్రకాష్ తండ్రి విగ్రహాన్ని బుగ్గన రాజేంద్రనాథ్ ఆవిష్కరించడం రాజకీయంగా సంచలనం అయింది.బుగ్గన విగ్రహాన్ని ఆవిష్కరించగానే కోట్ల అమర్ హై అంటూ ఆయన అనుచరులు నినాదాలు చేశారు. కొబ్బరికాయలు కొట్టారు. కోట్ల విగ్రహంతో పాటు రావు బహద్దూర్ బిరుదాంకితుడు బుగ్గన శేషారెడ్డి, బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలను కూడా ఆవిష్కరించారు. తన తండ్రి విగ్రహాన్ని బుగ్గన ఆవిష్కరించడంపై కోట్ల ఎలా స్పందిస్తారని అందరూ ఎదురుచూస్తున్నారు.

## వైఎస్ వివేకా కుమార్తె సునీత రెడ్డి పొలిటికల్ ఎంట్రీపై క్లారిటీ ఇచ్చిన షర్మిల

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తమ్ముడు వైఎస్ వివేకానంద రెడ్డి హత్యకు గురై నేటికీ ఐదేళ్లు గడిచాయి. ఈ నేపథ్యంలో ఆయన కూతురు సునీతా రెడ్డి ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఎద్ద ఎత్తున తరలివచ్చిన వివేకానంద రెడ్డి ఆత్మీయులు సన్నిహితులతోపాటు కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ అఖిలపక్ష నేతలు పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ



ఆత్మీయ సమావేశం కడప జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది. సునీత రెడ్డి పొలిటికల్ ఎంట్రీ పై ఈ సమావేశంలో క్లారిటీ ఇవ్వనున్నారని ఉద్దేశంతోనే చాలామంది నేతలు కూడా ఈ ఆత్మీయ సమావేశానికి హాజరయ్యారు. అయితే వారందరికీ సునీత పొలిటికల్ ఎంట్రీపై కాంగ్రెస్ ఏపీ ప్రెసిడెంట్ వైఎస్ షర్మిల ఓ క్లారిటీ ఇచ్చారు.వైఎస్ వివేకానంద రెడ్డి పులివెందులలోని తన నివాసంలో అతి కిరాతకంగా హత్యకు గురయ్యారు. ఈ విషయం అందరికీ తెలిసిందే.. రాష్ట్రంలో ప్రతిపక్ష నేతలు ఎవరు మాట్లాడిన ఈ అంశం మాట్లాడకుండా ఎవరు ప్రసంగించారు. అలాంటి వివేకానంద రెడ్డి హత్య జరిగి నేటికీ ఐదు సంవత్సరాలు గడిచింది. అందులో భాగంగానే ఆయన కుమార్తె వైఎస్ సునీత రెడ్డి వారి కుటుంబంతో సన్నిహితంగా ఆత్మీయంగా ఉండే నేతలతో కడపలోని జయరామ గార్డెన్స్‌లో ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సునీత అక్క సీఎం జగన్మోహన్ రెడ్డి చెల్లెలు, పీసీసీ చీఫ్ షర్మిల కూడా హాజరయ్యారు. అంతేకాక తెలుగుదేశం, బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఈ ఆత్మీయ సమావేశానికి వచ్చి సునీతకు సానుభూతి తెలియజేసి వివేకానంద రెడ్డికి నివాళులు అర్పించారు. వైఎస్ వివేకానంద రెడ్డి కుటుంబానికి అన్ని పార్టీల తరఫున అండదండలు ఉంటాయని తెలిపారు.ముఖ్యంగా ఎవరైతే ఈ హత్య కేసులో నిందలు ఆరోపించబడ్డ ఆదినారాయణ రెడ్డి సైతం ఈ ఆత్మీయ సమావేశానికి వచ్చి సునీత వెంటే ఉంటామని చెప్పడం సంచలనంగా మారింది. సునీత రాజకీయ జీవితంపై ఆలోచించి కుటుంబం ఒక నిర్ణయం తీసుకోవాలని, దానికి పార్టీలకు అతీతంగా ఆమెకు తోడుగా ఉంటామని తెలిపారు. ఇక సందర్భంగా పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి.కష్ట కాలంలో అండగా ఉండాల్సిన కుటుంబ సభ్యులే తనను నిందితురాలిగా చూశారని ఆవేదన వ్యక్తం చేశారు వైఎస్ షర్మిల. ఎవరు అండగా ఉన్నా లేకపోయినా సునీతకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆస్తి కోసమో అధికారం కోసమో ఈ మాటలు చెప్పడం లేదని, సునీతను చిన్నప్పటి నుంచి చూశాను కాబట్టే తన బాధను అర్థం చేసుకున్నానన్నారు. సునీతకు అన్ని విధాలుగా అండగా ఉంటానని తన కుటుంబానికి మాట ఇస్తున్నానని షర్మిల భావోద్వేగంతో మాట్లాడారు. వివేకానంద రెడ్డి కోప్పడడమే ఇంతవరకు నేను చూడలేదని, అలాంటిది ఆయనకి అంత క్రూరమైన చావు రావడం తట్టుకోలేకపోతున్నానని షర్మిల అన్నారు.ఇక తను రాజకీయాల్లోకి వస్తానా లేదా అనేది ముఖ్యం కాదని, కానీ ప్రజాక్షేత్రంలో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నానని వైఎస్ సునీత అన్నారు. వచ్చే ఎన్నికలలో మాత్రం అన్న వైఎస్ జగన్‌కు మాత్రం ఓటు వేయొద్దని పిలుపునిచ్చారు. తద్వారా నాకు జ్యూడిషరీలో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నానని సునీత అన్నారు. చివరికి పోటీ చేస్తానా లేదా అనేదానిపై క్లారిటీ ఇవ్వలేకపోయారు సునీత రెడ్డి. అయితే సునీత పొలిటికల్ ఎంట్రీపై షర్మిల స్పందిస్తూ.. సునీత నాతోనే నా వెంటే ఉన్నారని త్వరలోనే క్లారిటీ ఇస్తానని షర్మిల స్పష్టం చేశారు. అంటే సునీత కాంగ్రెస్‌లోనే ఉన్నట్టా? అనేదానిపై ఇంకా క్లారిటీ ఇవ్వలేదు..!

## ఏపీ ఎన్నికలు.. సీఈఓ ముఖేష్ కుమార్ మీనా కీలక సూచనలు

అమరావతి: హింసలేని, రీపోలింగ్‌కు ఆస్కారం లేని ఎన్నికలే లక్ష్యంగా ఈ సారి ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు.ఎక్కడ హింసాత్మక ఘటనలు జరిగినా ఎస్పీలదే బాధ్యత అని, ఘటనపై తక్షణం చర్యలు తీసుకోకపోతే ఎస్పీలపై చర్యలు తీసుకుంటామని సీఈఓ అన్నారు."ఎన్నికల కోడ్ అమలు నుంచి పెయిడ్ న్యూస్‌పై ప్రత్యేక దృష్టి పెడతామని, పార్టీ అనుబంధ ఛానళ్లలో అనుకూల వార్తలు వస్తే ఆ వ్యయాన్ని సదరు పార్టీ, అభ్యర్థుల ఖాతాల నుంచే చేసిన వ్యయంగా భావిస్తామని ముఖేష్ కుమార్ మీనా స్పష్టం చేశారు. ఎంసీఎంసీ కమిటీలు ఈ తరహా వార్తలను, ప్రచారాలను నిశితంగా పరిశీలన చేస్తున్నాయని పేర్కొన్నారు."ఇప్పటి వరకూ అన్ని రాజకీయ పార్టీల నుంచి 155 ప్రకటనల కోసం ఈసీకి దరఖాస్తు?లు వచ్చాయి. ఎమ్మెల్యేకు 40 లక్షలు, ఎంపీ అభ్యర్థికి 95 లక్షల వ్యయాన్ని మాత్రమే ఈసీ ఎన్నికల వ్యయంగా అనుమతించింది. నామినేషన్ల చివరి తేదీ నుంచి అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుంటాం. ప్రభుత్వ ఉద్యోగులు ఏ పార్టీ ప్రచారంలో పాల్గొనకూడదని సర్వీసు నిబంధనల్లోనే ఉంది. అలాంటి ఉదంతాలు వస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు.



## జగన్ కు షాక్.. వైసీపీకి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే

ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లాలో వైసిపికి మరో షాక్ తగిలింది. కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి ఆ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించారు. దీంతో ఎన్నికలకు ముందు జగన్ కు మరో ఎదురు దెబ్బ తగిలింది. పార్టీలో పదేళ్లుగా ఉన్న సరైన గుర్తింపు లేదని, తనను హీనంగా చూశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కావలి, ఉదయగిరి అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడి పనిచేశానన్నారు. ఆత్మాభిమానం చంపుకుని ఉండేలేకే రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అన్ని పార్టీల నుంచి పిలుపులు వస్తున్నాయన్న ఆయన తన అభిమానులను చర్చించి ఏ పార్టీలో చేరలన్నది త్వరలో ప్రకటిస్తానని వంటేరు వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.



## సీఏఏ అమలుపై స్టే కోరుతూ పిటిషన్‌లు..

### విచారణకు అంగీకరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: కేంద్ర సర్కారు ఇటీవల నోటిఫై చేసిన 'పౌరసత్వ సవరణ చట్టం ' అమలుపై స్టే విధించాలంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఆ పిటిషన్‌లపై మార్చి 19న విచారణ జరపనున్నట్లు శుక్రవారం వెల్లడించింది. సీఏఏ రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై తీర్పు వచ్చే వరకు ఆ చట్టం అమలును నిలిపివేయాలని కోరుతూ కేరళకు చెందిన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఇటీవల అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌ల తదితర పొరుగు దేశాల నుంచి భారత్‌కు శరణార్థులుగా వచ్చిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వాన్ని కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏను) తీసుకొచ్చింది. కేంద్ర హోంశాఖ ఇటీవలే ఆ చట్టాన్ని నోటిఫై చేసింది. అయితే దానిపై కొన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇది రాజ్యాంగ విరుద్ధం, వివక్షాపూరితమైందంటూ ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ అభ్యంతరం వ్యక్తం చేసింది.ఈ చట్టం అమలును నిలిపివేయాలని తన పిటిషన్‌లో పేర్కొంది.

# సంపాదకీయం

శనివారం 16-03-2024

## కార్పొరేట్ క్విడ్ ప్రోకో..

ఎలక్టోరల్ బాండ్ వివరాలను వెల్లడించడానికి జూన్ 30 వరకు పొడిగింపు కోసం సుప్రీంకోర్టులో ఎస్బీఐ పిటిషన్ దాఖలు చేస్తే, ఈ పొడగింపు కుదరదంటూ.. మార్చి 12వ తేదిలోపు వివరాలు సమర్పించాలని ఆదేశించింది. దీంతో ఎస్బీఐ ఆ వివరాలను ఈసీకి అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచింది. సుప్రీంకోర్టు తీర్పు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రభావం చూపుతుందని చెప్పవచ్చు. పాలక పక్షం ప్రాపకం కోసం పాకులాడని కార్పొరేట్ సంస్థ ఉంటుందా? అని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ వంటి ఆర్థిక వేత్తలు సందేహాలు వ్యక్తం చేయడం ఈ సందర్భంగా మన గుర్తించుకోవాలి. కార్పొరేట్ చందాల పై సుప్రీంకోర్టు తీర్పు స్వాగతించదగిన పరిణామమే అయితే, అసలు సమస్య ఎన్నికల వ్యయం, దాని వెనక ఉండేటటువంటి అవినీతి, వ్యక్తిగత చందాల ద్వారా అవినీతి జరగదనే గ్యారెంటీ ఏమీ ఉండదనేది వాస్తవం. ఎన్నికల వ్యయం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయి,రాజకీయ పార్టీలు కార్యకర్తల చందాల మీద మాత్రమే ఆధారపడే రోజులు ఎప్పుడో పోయాయి. ప్రస్తుతం అవినీతికి దారి తీసే లొసుగులను చక్కదిద్దటం తక్షణావసరం. అందుకే ఓటర్లందరూ విద్యావంతులై ఆలోచించాలి. అవినీతికి కళ్లెం పడుతున్న ప్రభుత్వాలను కూల్చి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి.రాజకీయ చందాలకు చట్టబద్ధమైన నిధులను నియంత్రిత బ్యాంకింగ్ మార్గాల ద్వారా సేకరించడాన్ని ప్రోత్సహిస్తున్నామని, చందాలు ఇచ్చుకునే వారు రాజకీయ వేధింపులకు గురికాకుండా ఉండేందుకు పేర్లను గోప్యంగా ఉంచటం అవసరమని ప్రభుత్వం చేసిన వాదనను ధర్మాసనం గతంలోనే తోసిపుచ్చింది. కంపెనీలు చందాలు ఇస్తున్నాయి అంటే, బదులుగా ఏదైనా లబ్ధి పొందాలని ఆలోచన దాని వెనక దాగి ఉండే అవకాశాలు ఉంటాయని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. అంటే, ఇచ్చిపుచ్చుకునే ధోరణి (క్విడ్ ప్రో కో) ఇక్కడ పనిచేస్తుందని స్పష్టం చేశారు. స్వేచ్ఛాయుత ఎన్నికల ప్రక్రియకు ఈ ఇచ్చుకోవడం అనేది గొడ్డలిపెట్టు వంటిదని హెచ్చరించారు. బాండ్లు పారదర్శకతకు మసి పూస్తాయని గతంలో ఈ కేసు విచారణ సందర్భంగా ఆయన ఉటంకించారు.నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అత్యుత్సాహంతో అమలు చేసిన ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని 2024 ఫిబ్రవరి 15న చారిత్రాత్మకమైన తీర్పును వెలువరించింది. ఈ పథకం సమాచార హక్కును ఉల్లంఘిస్తున్నదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల బెంచ్ ఏకాభిప్రాయ తీర్పులో స్పష్టం చేసింది. అయితే, ఈ కేసులో ప్రధానంగా రెండు అంశాలు ఉన్నాయి. కార్పొరేట్లు రాజకీయ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా 'స్వచ్ఛందంగా' చెల్లించే చందాల సమాచారం గోప్యంగా ఉంచటం చెల్లుతుందా? తదనుగుణంగా ప్రజాప్రాతినిధ్య చట్టానికి, ఆదాయపు పన్ను చట్టానికి, కంపెనీల చట్టానికి చేసిన సవరణలు చెల్లుబాటు అవుతాయా? అనేది మొదటిది. ఇక రెండోది... కార్పొరేట్లు రాజకీయ పార్టీలకు 'అపరిమితమైన' చందాలు సమర్పించుకోవడానికి సంబంధించి కంపెనీల చట్టానికి చేసిన మరో సవరణ రాజ్యాంగబద్ధత గురించి. ఈ రెండు అంశాల్లోనూ కేంద్రానికి ప్రతికూలంగానే కోర్టు తీర్పు వెలువడింది.పౌరులు తమ 'ఓటు హక్కును సమర్థవంతంగా వినియోగించుకోవాలంటే రాజకీయ పార్టీలకు అందుతున్న నిధుల సమాచారం తెలుసుకోవడమనేది తప్పనిసరని ప్రధాన న్యాయమూర్తి చెప్పారు. కానీ ఈ పథకంలో పారదర్శకత లోపించడాన్ని సుప్రీంకోర్టు ఎత్తిచూపింది. రాజ్యాంగంలోని 19(1 )(ఏ) అధికరణాన్ని ఇది స్పష్టంగా ఉల్లంఘిస్తున్నది అని ఆయన తేల్చి చెప్పారు. ఈ తీర్పు పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీకి పెద్ద చెంపదెబ్బేనని చెప్పాలి. అంతేకాక ఎస్బీఐ ఈ బాండ్ల జారీని తక్షణమే నిలిపివేయాలని ఆదేశించింది. పైగా తీర్పు వెలువడే వరకు నగదుగా మార్చుకోని బాండ్లను పార్టీలు వెనక్కి తిరిగి ఇచ్చివేయాలని కూడా స్పష్టం చేసింది. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన 2019 ఏప్రిల్ 12 నుంచి మొత్తం అన్ని బాండ్ల వివరాలు సమర్పించాలని ఎస్బీఐని ఆదేశించింది. అదేవిధంగా, ఎలక్టోరల్ బాండ్ల ద్వారా నిధులు పొందిన రాజకీయ పార్టీల వివరాలను తెలపాలని పేర్కొంది. ఈ రెండు మార్చి 6వ తేదీలోగా జరగాలని గడువును కూడా విధించింది. కానీ దానిని జూన్ 30 వరకు పొడిగించాలని ఎస్బీఐ కోరింది.నిర్దిత పరిస్థితుల్లో కంపెనీలు రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చ వచ్చునని కంపెనీలు చట్టం(2013)లో 182 వ నిబంధన అనుమతిస్తున్నది. అయితే, 2017 లో 'ఫైనాన్స్ చట్టానికి' సవరణలు చేయడం ద్వారా మోడీ ప్రభుత్వం అనేక మినహాయింపులను అమలులోకి తెచ్చింది. వీటి ఆధారంగా 2018 నుంచి ఎలక్టోరల్ బాండ్ల పథకం అమల్లోకి వచ్చింది. 2018 నుంచి 2022 మార్చి వరకు జారీ అయిన మొత్తం ఎలక్టోరల్ బండ్లలో 57 శాతం అంటే, రూ.5,271 కోట్లు బీజేపీకి వెళ్లాయి. ప్రతిపక్ష కాంగ్రెస్‌కు 951 కోట్లు మాత్రమే దక్కాయి. అంటే పథకంలో ఉన్న మొగ్గును సూచిస్తుంది.

# కర్నూలులో టీడీపీ పట్టు సాధించేనా

కర్నూలు, మార్చి 15 రాయలసీమ ముఖద్వారం కర్నూలు. లోక్ సభ నియోజకవర్గానికి చాలా ప్రత్యేకత ఉంది. గతంలో ఇక్కడ నుంచి గెలిచిన ఎంపీలలో కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఆయన తనయుడు కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి కేంద్ర పదవులు చేపట్టారు. తొలి దళిత ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా అలాగే అల్ ఇండియా కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షుడిగా దామోదరం సంజీవయ్య కూడా ఇక్కడి వారే. కర్నూలు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో పునర్విభజన జరగక ముందు 6 అసెంబ్లీలో స్థానాల్లో ఉండేది. పునర్విభజన తర్వాత కొత్తగా మంత్రాలయం నియోజకవర్గం రావడంతో మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాలు వచ్చాయి. వాటిలో ఒకటి ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గ మిగిలిన ఆరు నియోజకవర్గాలు జనరల్ స్థానాలు.కర్నూలు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోకి కర్నూలు అసెంబ్లీతోపాటు కోడుమూరు, పత్తికొండ, ఎమ్మిగనూర్, ఆలూరు, ఆదోని, మంత్రాలయం అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. 1952లో మద్రాసు రాష్ట్రం ఉన్నప్పుడు ఏర్పడిన ఈ నియోజకవర్గానికి తొలి పార్లమెంటు సభ్యుడు సీతారామిరెడ్డి. భారత జాతీయ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 1952 నుంచి మొత్తం 18 లోక్‌సభ ఎన్నికలు జరుగ్గా 12 సార్లు కాంగ్రెస్, 2 సార్లు టిడిపి, 2 సార్లు వైస్సార్సీపీ, ఒక్కసారి స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. ఇలా గెలిచిన వారిలో సమీప ప్రత్యర్థైన సోమప్పపై కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన కోట్ల విజయ భాస్కర్ రెడ్డి 1,99,356 ఓట్ల మెజార్టీతో గెలుపొంది అభ్యర్థిగా ఎన్నికై మొదటిసారే కేంద్రమంత్రి పదవి చేపట్టారు. 10వ సారి 1991 లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా ఎస్వీ సుబ్బారెడ్డిపై కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందిన కోట్ల విజయభాస్కర్ రెడ్డికి ఏపీ ముఖ్యమంత్రిగా అవకాశం రావడంతో లోక్ సభకు రాజీనామా చేశారు. 15వసారి 2004లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి కే కృష్ణమూర్తిపై కాంగ్రెస్ పార్టీ తరపున కోట్ల జయసూప్రకాశ్ రెడ్డి గెలుపొంది 15వ లోక్ సభ అభ్యర్థిగా ఎన్నికయ్యారు. అనంతరం 2009లో మరోసారి గెలిచిన సూర్య ప్రకాష్ రెడ్డి రైల్వే సహాయ శాఖ మంత్రి పదవి చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత జరిగిన రెండు దఫా ఎన్నికల్లో వైఎస్ఆర్సీపీ విజయాలను తన ఖాతాలో వేసుకుంది.కర్నూలు పార్లమెంట్ పరిధిలోని ఓటర్లలో చైతన్యం ఎక్కువ, పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ప్రతి ఎన్నికల్లోను పోలింగ్ శాతం పెరుగుతూనే ఉంది. 2009లో 62.48 శాతం పోలింగ్ నమోదు కాగా, 2014లో 71.21 శాతానికి చేరి 2019లో 79.65% పోలింగ్ జరిగింది. దీనిని బట్టి ప్రతిసారి జరిగిన ఎన్నికల్లో కూడా కొత్త ఓటర్లు నమోదు అవడం.. ఆ కొత్త ఓటర్లు అంతే చురుకుగా ఓటింగ్‌లో పాల్గొనడం జరుగుతోంది. త్వరలో జరగబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో కర్నూలు పార్లమెంట్ అభ్యర్థిగా ముందు కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్‌ను వైసీపీ ప్రకటించింది. ఆయన పోటీ నుంచి తప్పుకని టీడీపీలో చేరడంతో కర్నూలు జిల్లా అధ్యక్షుడు, కర్నూలు కార్పొరేషన్ మేయర్ బీవై రామయ్య వైసీపీ నుంచి పార్లమెంటు అభ్యర్థిగా బరిలో దిగుతున్నారు. ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి మాత్రం తన అభ్యర్థి ప్రకటన విషయంలో అచి తూచి అడుగులు వేస్తోంది. ముందుగా అందరూ మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డిని తెలుగుదేశం ఎంపీగా బరిలోకి దింపుతుందని అందరూ భావించినా, ఎవరు ఊహించని విధంగా ఆయనను డోన్ నుంచి పోటీకి దింపుతున్నారు. టిడిపి,జనసేన,బిజెపి కూటమి అభ్యర్థిగా ఎవరు పార్లమెంటు అభ్యర్థిగా నిలబడతారు అనేది ఇంకా తెలియాల్సి ఉంది. అక్కడ టికెట్ ఆశిస్తున్న వైసీపీ ఎంపీ సంజీవ్ కుమార్ టీడీపీలో చేరారు. ఆయనకు సీటు ఖాయమనే టాక్ నడుస్తోంది.

# రెండో జాబితాలో సీనియర్లకు షాక్


విజయవాడ, మార్చి 15 టీడీపీ రెండో జాబితాలో సీనియర్లకు షాక్ తగిలింది. 34 మందితో విడుదలైన రెండో జాబితాలో పలువురు సీనియర్లకు సీటు దక్కలేదు. సీనియర్ నేతలు గంటా శ్రీనివాసరావు, కళావెంకట్రావు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, దేవినేని ఉమా, కేఎస్ జవహర్ తో పాటు పలువురు సీనియర్ల పేర్లు రెండో జాబితాలో లేవు. వీరి పోటీపైన గత కొన్ని రోజులుగా తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. మొదటి జాబితాలో 94 మంది అభ్యర్థులు, సెకండ్ లిస్టులో 34మంది టికెట్లు కేటాయించింది టీడీపీ. గంటా శ్రీనివాసరావును చీపురుపల్లిలో పోటీ చేయాలని చంద్రబాబు కోరుతున్నారు. అయితే అక్కడ పోటీ చేయడంపై గంటా వెనుకడుగు వేస్తున్నారు. తనకు భీమిలి నియోజకవర్గం కావాలంటున్నారు. ఈ సీటుపై ఎటూ తేలకపోవడంతో పెండింగ్ లో పెట్టారు. మాడుగులలో గవిరెడ్డి రామానాయుడుకు, పివిజి కుమార్ కు నిరాశే ఎదురైంది. అక్కడ పైలా ప్రసాద్ కు చాన్సిచ్చారు. వైసీపీకి రాజీనామా చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలంకు సత్యవేడు టికెట్ ఇచ్చింది టీడీపీ. విజయవాడ వెస్ట్ లో జలీల్ ఖాన్ కు టికెట్ దక్కలేదు. రాజమండ్రి రూరల్ నుంచి గోరంట్ల బుచ్చయ్య చౌదరి టికెట్ దక్కించుకున్నారు. రెండో జాబితాల్లోనూ తమకు కచ్చితంగా టికెట్ దక్కుతుందని సీనియర్లు భావించారు. అయితే, వారికి సెకండ్ లిస్టులోనూ నిరాశే ఎదురైంది. మూడో జాబితాలో అయినా తమకు టికెట్ వచ్చే అవకాశం ఉందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంకా 14 సీట్లను పెండింగ్ లో పెట్టింది. రెండో జాబితాలో ఏడుగురు మహిళలకు చోటు కల్పించింది టీడీపీ. 35ఏళ్ల లోపు వారిలో ఇద్దరు, 75ఏళ్లు పైబడిన వారిలో ఇద్దరు లిస్టులో ఉన్నారు. టీడీపీ సెకండ్ లిస్ట్ లో పీహెచ్ డీ చేసిన వారు ఒకరు, పీజీ చదువుకున్న వారు 11మంది, 10లోపు చదువుకున్న వారు ఐదుగురు ఉన్నారు. ఇక పొత్తులో భాగంగా గాజువాక టికెట్ టీడీపీకే దక్కింది. గాజువాక సీటును టీడీపీ నేత పల్లా శ్రీనివాస్ కు కేటాయించారు. మరోవైపు రెండో జాబితాలోనూ ఉమ్మడి విశాఖ జిల్లా సీనియర్ నేతల పేర్లు కనిపించలేదు. గెలుపే ప్రామాణికంగా, సర్వేలు, ప్రజాభిప్రాయసేకరణ, పార్టీ పరంగా అంతర్గతంగా జరిగిన అనేక సర్వేల ఆధారంగానే రెండు జాబితాల్లోనూ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను కొనసాగించింది టీడీపీ. రెండు జాబితాల్లోనూ టికెట్ దక్కక తీవ్ర నిరాశలో ఉన్న వ్యక్తుల్లో గంటా శ్రీనివాసరావు, కళా వెంకట్రావు, దేవినేని ఉమా, బుద్ధా వెంకన్న, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కేఎస్ జవహర్ ప్రధానంగా ఉన్నారు. ఏపీ టీడీపీ మాజీ అధ్యక్షుడు కళా వెంకట్రావుకు కూడా టిక్కెట్ ఖారరు చేయలేదు.

ఎంపీలుగా అవకాశమా..

శ్రీకాకుళం జిల్లాలో మాజీ మంత్రి కళా వెంకట్రావుకు రెండో జాబితాలో సైతం చోటు దక్కలేదు. ఆయన ఎచ్చెర్ల టిక్కెట్టును ఆశిస్తున్నారు. విజయనగరం జిల్లాలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారికి సైతం నిరాశే ఎదురయింది. ఆమె ఎస్.కోట టికెట్ ఆశిస్తున్నారు. విశాఖ జిల్లాలో ఇద్దరు మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణ మూర్తి లకు టిక్కెట్లు ప్రకటించలేదు. గంటా శ్రీనివాసరావు భీమిలి అసెంబ్లీ టికెట్ ఆశిస్తుండగా.. బండారు సత్యనారాయణమూర్తి పెందుర్తి అసెంబ్లీ టిక్కెట్ ఆశిస్తున్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమాకు సైతం ఈసారి కూడా చుక్కెదురు అయ్యింది. ఆయన మైలవరం లేదా పెనమలూరు టికెట్ ఆశిస్తున్నారు. సర్వేపల్లి సీటును మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేరు సైతం ప్రకటించలేదు. అటు నెల్లూరు సిటీ టికెట్ మాజీమంత్రి నారాయణ ఆశిస్తున్నారు. ఆయన పేరును సైతం ప్రకటించలేదు.అయితే చాలామంది సీనియర్ల పేర్లు ఎంపీ అభ్యర్థులుగా ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు కళా వెంకట్రావు కుటుంబాన్ని పక్కన పెట్టడం హాట్ టాపిక్ గా మారింది. చీపురుపల్లి నుంచి కిమిడి నాగార్జున టికెట్ ఆశిస్తున్నారు. అయితే ఈసారి చీపురుపల్లి నుంచి గంటా శ్రీనివాసరావు పోటీలో పెట్టాలని చంద్రబాబు భావిస్తున్నారు. అదే సమయంలో విజయనగరం ఎంపీ స్థానం నుంచి పోటీ చేయాలని కళా వెంకట్రావుకు సూచించినట్లు వార్తలు వచ్చాయి. అయితే అనూహ్యంగా ఆ సీటును బిజెపికి కేటాయించినట్లు ప్రచారం జరుగుతోంది. విజయనగరం ఎంపీ సీటు విషయంలో స్పష్టత రాకపోవడం వల్లే.. ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా కళా వెంకట్రావు పేరు ప్రకటించలేదని టిడిపి వర్గాలు చెబుతున్నాయి.మరోవైపు గంటా శ్రీనివాసరావు పేరును ఇంతవరకు ప్రకటించలేదు. ఆయన భీమిలి అసెంబ్లీ స్థానాన్ని కోరుతుండగా.. చంద్రబాబు మాత్రం చీపురుపల్లిలో పోటీ చేయాలని సూచించినట్లు వార్తలు వచ్చాయి. అయితే అందుకు గంటా సమ్మతించలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈరోజు మరోసారి గంటా చంద్రబాబును కలిశారు. ఇప్పుడు సైతం చంద్రబాబు గంటాను చీపురుపల్లి నుంచి పోటీకి సిద్ధంగా ఉండాలని సూచించినట్లు సమాచారం. మరో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి విషయంలో సైతం చంద్రబాబు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. పెందుర్తి సీటును జనసేన పొత్తులో భాగంగా కోరుతోంది. అక్కడ మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. అందుకే అక్కడ అభ్యర్థి విషయంలో స్పష్టత రాలేదని తెలుస్తోంది. మొత్తానికైతే రెండో జాబితాలో సైతం చోటు దక్కని సీనియర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఇంకా టిడిపిలో కేవలం 16 స్థానాలకు మాత్రమే అభ్యర్థులను ప్రకటించాల్సి ఉండడంతో.. ఆశావహుల్లో ఒక రకమైన టెన్షన్ కనిపిస్తోంది.

# తీరిన చింతమనేని చింత

ఏలూరు, మార్చి 15 దెందులూరు తెలుగుదేశం శ్రేణులకు చంద్రబాబు శుభవార్త చెప్పేశారు. తెలుగుదేశం ఫైర్‌బ్రాండ్ చింతమనేని ప్రభాకర్‌కు సీటు కన్ఫార్మ్ చేశారు. స్వయంగా అధినేత చంద్రబాబే ఆయనకు ఫోన్ చేసి టిక్కెట్ నీకేనంటూ చెప్పడంతో ఆయన ఆనందానికి అవదుల్లేవ్..నేడు ప్రకటించనున్న రెండో జాబితాలో చింతమనేని ప్రభాకర్( పేరు ఉండే అవకాశం ఉంది..తెలుగుదేశ ఫైర్‌బ్రాండ్ చింతమనేని ప్రభాకర్‌కు ఎట్టకేలకు సీటు కన్ఫార్మ్ అయ్యింది. తెలుగుదేశం అధినేత చంద్రబాబే స్వయంగా ఆయనకు ఫోన్ చేసి సీటు కన్ఫార్మ్ చేశారు. బుధవారం రాత్రి 7.50 గంటలకు చంద్రబాబు కార్యాలయం నుంచి చింతమనేనికి ఫోన్ వచ్చింది. స్వయంగా చంద్రబాబే(మాట్లాడుతూ..ఈసారి ఎట్టిపరిస్థితుల్లోనూ మనం గెలవాలి..సీటు నీకే ఇస్తున్నాం గెలిపించుకుని తీసుకురా అంటూ చెప్పడంతో చింతమనేని ఒక్కసారిగా కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇన్నిరోజుల ఊగిసలాటకు తెరదించుతూ సీటు కేటాయించడంపై ఆయన చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. సర్వేల్లో నువ్వు మంచి మెజార్టీతో గెలవబోతున్నావని...మంచి పదవిలో కూడా ఉంటావని చెప్పడంతో చింతమనేని ఆనందానికి అవదుల్లేవ్. సీటు ఇవ్వడంతోపాటు చంద్రబాబు కొన్ని జాగ్రత్తలు సైతం చెప్పారని తెలిసింది. దూకుడు కొంత తగ్గించుకోవాలని...అతి విశ్వాసం అసలు వద్దని జాగ్రత్తగా పోలింగ్ నిర్వహించాలని చెప్పినట్లు తెలిసింది. తొలి జాబితాలోనే దాదాపు వంద సీట్లు ప్రకటించిన చంద్రబాబు... కచ్చితంగా ఇస్తారనుకున్న దెందులూరు టిక్కెట్ పెండింగ్‌లో పెట్టారు. గత ప్రభుత్వ హయాంలో చింతమనేని ప్రభాకర్ దూకుడు వ్యవహారం కొంత వివాదస్పదమైంది. ఎమ్మార్వోతో గొడవ, విలేకరిపై దాడి, కోడిపందెలు, మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడంపై బహిరంగ వ్యాఖ్యలు ఇవన్నీ పార్టీని కొంత ఇబ్బందిపెట్టడంతో ఈసారి ఆయనకు టిక్కెట్ ఇవ్వడం అనుమానమేనని తెలుగుదేశం నేతలే చర్చించుకున్నారు. దీన్ని బలపరుస్తూ ఆయనకు మొదటి విడత కోటాలో టిక్కెట్ కన్ఫార్మ్ చేయలేదు. దీంతో దెందులూరు తెలుగుదేశం శ్రేణులతోపాటు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోనూ తెలుగుదేశం నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చింతమనేని దూకుడు కొంత ఇబ్బందికర పరిస్థితి అయినప్పటికీ....వైసీపీ నేతలను తట్టుకోవాలంటే ఆమాత్రం ఫైర్ ఉండాల్సిందేనంటూ చంద్రబాబుకు సూచించారు.చింతమనేని ప్రభాకర్‌కు కేవలం ఆయన నియోజకవర్గంలోనే గాక... రాష్ట్రవ్యాప్తంగానూ అభిమానులు ఉన్నారు. సభలోనూ, బయట జగన్‌పై ఒంటికాలుపై దూసుకెళ్లడం, వైసీపీ నేతలకు వారి భాషలోనే సమాధానం చెప్పడంలో చింతమనేని ధిట్ట. ఈ దూకుడే ఆయనకు ప్రజాభిమానం తెచ్చిపెట్టినా....పార్టీకి కొంత ఇబ్బందికర పరిస్థితులనూ తెచ్చిపెట్టాయి. దీంతో ఈసారి ఆయనకు కాకుండా ఆయన కుటుంబ సభ్యులకు టిక్కెట్ ఇవ్వాలని మొదటి భావించారు. అందులో భాగంగానే చింతమనేని ప్రభాకర్ కుమార్తె పేరిట ఐవీఆర్ఎస్( సర్వే సైతం నిర్వహించారు. అయితే ఎక్కువ మంది చింతమనేని ప్రభాకర్ ఉంటేనే బాగుంటుందని చెప్పడంతో....అధిష్ఠానం ఆయన వైపే మొగ్గు చూపింది. రెండో జాబితాలో చంద్రబాబు 34 స్థానాలకు అభ్యర్థుల్ని ప్రకటించారు. మొదటి జాబితాలో జనసేనతో ఉమ్మడి జాబితా ప్రకటించిన టీడీపీ, ఇప్పుడు సపరేట్ గా రెండో జాబితాను విడుదల చేసింది. మొదటి జాబితాలో 94మంది అభ్యర్థులను ప్రకటించిన బాబు రెండో జాబితాలో 34 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఇంకా 14 అసెంబ్లీ, 17 ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది.



# వారసులకు అవకాశాలు

విజయవాడ, మార్చి 15 తెలుగుదేశం పార్టీ రెండో జాబితాలో వారసులు, రాజకీయ కుటుంబసభ్యులకు చోటు లభించింది. రెండో జాబితాలో రాజకీయ కుటుంబం నుంచి ఏడుగురికి అవకాశం కల్పించారు చంద్రబాబు. ప్రత్తిపాడు స్థానానికి దివంగత వరపుల రాజా భార్య సత్యప్రభ కు చోటుర దక్కింది. టిక్కెట్ వరపుల రాజాకే దక్కాల్సింది.. కానీ ఆయన హఠాత్తుగా చనిపోవడంతో.. ఆయన భార్యకు ఇంచార్జ్ పదవి ఇచ్చారు. ఆమె చురుగ్గా రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడంతో చంద్రబాబు ఆమె పేరునే ఖరారు చేశారు. నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని కోవూరు కు కు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి భార్య వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డికి అవకాశం ఇచ్చారు. నిజానికి అక్కడ మరో వారసుడికి అవకాశం ఇవ్వాలనుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి కుమారుడికి ఇంచార్జ్ ఇచ్చారు. ఆయనే పని చేసుకుంటున్నారు. వేమిరెడ్డి పార్టీలో చేరే వరకూ ఆయనకే టిక్కెట్ అని చెప్పుకున్నారు. వేమిరెడ్డి చేరడంతో భార్యకు టిక్కెట్ కేటాయించాలని నిర్ణయించారు. వెంకటగిరి స్థానానికి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె కురుగొండ్ల లక్ష్మీప్రియకు అవకాశం కల్పించారు. కురుగొండ్ల రామకృష్ణనే పోటీ చేయాల్సి ఉంది కానీ మహిళలకు అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో ఆయన వారసురాలికి చాన్సిచ్చారు. శ్రీకాళహస్తి నుంచి బొజ్జల గోపాల కృష్ణరెడ్డి కుమారుడు బొజ్జల సుధీర్ రెడ్డికి పోటీ చేయనున్నారు. నిజానికి గత ఎన్నికల్లోనూ బొజ్జల సుధీర్ పోటీ చేశారు.ఆయన ఓడిపోయారు. ఓడిపోయి నప్పటి నుండి నియోజకవర్గంలో పని చేసుకుంటున్నారు. ఇక కడప జిల్లా కమలాపురం స్థానానికి పుత్తా నరసింహారెడ్డి కుమారుడు పుత్తా చైతన్య రెడ్డికి చోటు కల్పించారు. పుత్తా నరసింహారెడ్డి పలుమార్లు పోటీ చేసారు. ఈ సారి వారసుడ్ని రంగంలోకి తెచ్చారు. పుట్టపర్తి స్థానం నుంచి పల్లె రఘు నాథరెడ్డి కోడలు పల్లె సింధుర రెడ్డి పోటీకి అవకాశం ఇచ్చారు. ఇక అనంత పురం జిల్లా కదిరికి మాజీ ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ భార్య యశోదా దేవికి పోటీకి అవకాశం కల్పించారు. కందికుంట ప్రసాద్‌కు కొన్ని కేసుల్లో న్యాయపరమైన చిక్కులుఉండటంతోఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

# వేమిరెడ్డి చుట్టూ రాజకీయం

నెల్లూరు, మార్చి 15 నెల్లూరు జిల్లా రాజకీయం ప్రస్తుతం వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి చుట్టూ తిరుగుతోంది. వైసీపీకి రాజీనామా చేసి ఆయన ఇటీవలే టీడీపీలో చేరారు. టీడీపీ తరపున ఆయన నెల్లూరు లోక్ సభకు పోటీ చేస్తారనే అంచనాలున్నాయి. అయితే అది అధికారికం కాదు. ఆయన భార్య వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి కూడా జిల్లాలో ఏదో ఒక అసెంబ్లీ సీటు ఖాయమనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అధికారికంగా నలుగురి పేర్లు మాత్రమే ఖాయమయ్యాయి. మిగతా చోట్ల ఇన్ చార్జ్ లు ఉన్నా కూడా వారికి సీట్లు అనుమానమే. అందులోనూ జనసేన, బీజేపీతో పొత్తు పెట్టుకోవడం వల్ల ఎవరి సీటుకి ఎసరు వస్తుందోననే ఆందోళన మిగతావారిలో ఉంది. ఈ నేపథ్యంలో వీపీఆర్ సతీమణి ప్రశాంతి రెడ్డి కోవూరు నుంచి పోటీ చేస్తారనే ప్రచారం కూడా ఉంది. అందుకే కోవూరు టీడీపీ నేతలు ఇప్పుడు వీపీఆర్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆయన్ను ప్రసన్నం చేసుకోడానికి ఆపసోపాలు పడుతున్నారు. వాస్తవానికి వైసీపీలో ఉన్నప్పుడు కూడా వీపీఆర్ కోవూరు టికెట్ తన భార్యకు ఇవ్వాలని అడిగారట. అయితే అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని కాదని జగన్ ఆ సీటు వేమిరెడ్డి భార్యకు ఇచ్చే అవకాశం లేదు. దీంతో ఆ ప్రస్తావన అక్కడితో ఆగిపోయింది. ఇప్పుడు వేమిరెడ్డి టీడీపీలో చేరడంతో, ఆయన కోవూరు సీటు అడిగే అవకాశం ఉంది. అయితే కోవూరులో ప్రస్తుతం పోలంరెడ్డి దినేష్ రెడ్డి టీడీపీ ఇన్ చార్జ్ గా ఉన్నారు. ఆయన తండ్రి పోలంరెడ్డి శ్రీనివాసులరెడ్డి గతంలో టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో నల్లపురెడ్డి ప్రసన్నపై పోలంరెడ్డి గెలిచారు, 2019లో ఓడిపోయారు. 2014లో ఆసీటు తన కొడుక్కి వస్తుందని ఆశించారు, ఆయన ముందునుంచి చేసిన ప్రయత్నాల వల్ల పోలంరెడ్డి దినేషన్ రెడ్డినే కోవూరుకి ఇన్ చార్జ్ గా నియమించారు చంద్రబాబు. కానీ వీపీఆర్ చేరికతో ఆ సీటు సందిగ్ధంలో పడింది. దీంతో తండ్రీకొడుకులిద్దరూ వీపీఆర్ ని తరచూ కలుస్తున్నారు. బాబ్బాబు.. మా సీటుకి ఎసరు పెట్టొద్దని విజ్ఞప్తి చేస్తున్నారు. రాజకీయాలతో ప్రత్యక్ష సంబంధం లేని రోజుల్లో కూడా జిల్లాకు చెందిన వ్యాపారవేత్తగా రాజకీయ నాయకులకు ఆర్థిక సాయం చేసేవారు వీపీఆర్. ఆయన ద్వారా ఎలక్షన్ ఫండ్ తీసుకుని ఎన్నికల్లో గెలిచిన తర్వాత, ఆయనకు వ్యాపారాల్లో పరోక్షంగా సాయపడేవారు నాయకులు. పార్టీలకతీతంగా ఈ సాయం జరిగేది. ఆయన టీడీపీలో చేరి ప్రత్యక్ష రాజకీయాల్లో పోటీ చేయాలనుకోవడంతో ఆ పార్టీ ఆశావహులకు కూడా వీపీఆర్ కొండంత అండగా కనపడుతున్నారు. నాయకులంతా ప్రతి రోజూ ఆయన ఇంటి ముందు పరేడ్ చేస్తున్నారు. వీపీఆర్ కంట్లో పడాలని ఆశపడుతున్నారు. నెల్లూరు లోక్ సభ పరిధిలోకి వచ్చే అసెంబ్లీ నియోజకవర్గాల నేతలంతా రోజుకొకరు ఆయనతో భేటీ అవుతున్నారు. తమ తమ నియోజకవర్గాలకు ఆహ్వానిస్తున్నారు. పనిలో పనిగా తమ అనుచరులను తీసుకొచ్చి వీపీఆర్ కి పరిచయం చేస్తున్నారు. టీడీపీలో చేరిన తర్వాత వీపీఆర్ ఆఫీస్ నేతలతో బిజీబిజీగా మారిపోయింది.

## చీపురుపల్లి అయితే ఓకే...

విశాఖపట్టణం, మార్చి 15 మాజీ మంత్రి గంటాకు ఈసారి టిక్కెట్ లేనట్టేనా? పొమ్మనలేక పొగ పెడుతున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గంటా విషయంలో చంద్రబాబుతో పాటు లోకేష్ సీరియస్ గా ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే ఆయన పేరు రెండో జాబితాలో లేనట్లు సమాచారం. ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి గంటా పోటీ చేశారు. ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ టిడిపి కార్యక్రమాల్లో పాల్గొనడం తగ్గించేశారు. ఒకానొక దశలో ఆయన వైసీపీలో చేరతారని ప్రచారం జరిగింది. కానీ నాడు మంత్రిగా ఉన్న అవంతి శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర రీజియన్ ఇన్చార్జిగా ఉన్న విజయసాయిరెడ్డి అడ్డుకున్నట్లు తెలుస్తోంది. టిడిపి కష్టకాలంలో ఉన్నప్పుడు గంటా పెద్దగా కనిపించలేదు. గత ఏడాదిగానే యాక్టివ్ అయ్యారు. కానీ బలమైన నేత కావడంతో ఎన్నికల్లో టికెట్ తప్పకుండా దక్కుతుందని అంతా భావించారు. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో.. ఆయనకు పొమ్మన లేక పొగ పెడుతున్నారని ప్రచారం జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో విశాఖ జిల్లా నుంచి పోటీ చేయాలని గంటా భావించారు. నగరంలోని నాలుగు నియోజకవర్గాలతో పాటు భీమిలిలో ఏదో ఒక స్థానం నుంచి పోటీ చేయాలని ఆలోచన చేశారు. ఇదే విషయాన్ని చంద్రబాబుకు చెప్పారు. అయితే చంద్రబాబు గంటాను చీపురుపల్లి నుంచి పోటీ చేయాలని సూచించారు. అక్కడ మంత్రి బొత్స సత్యనారాయణ వైసీపీ అభ్యర్థిగా ఉండడంతో.. ఆయనపై పోటీ చేయాలని చంద్రబాబు ఆదేశించారు. అయితే అందుకు గంటా అంగీకరించలేదు. దీంతో దీనిపై తర్వాత ఆలోచిద్దామని.. కచ్చితంగా ప్రత్యామ్నాయం చూస్తానని కొద్ది రోజుల కిందట చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే ఈరోజు టిడిపి అభ్యర్థుల రెండో జాబితా ప్రకటించనున్న నేపథ్యంలో గంటా శ్రీనివాసరావు చంద్రబాబును కలిశారు. తనకు విశాఖ జిల్లాలో ఏదైనా నియోజకవర్గాన్ని కేటాయించాలని కోరారు. అయితే చంద్రబాబు మాత్రం చీపురుపల్లి నియోజకవర్గంలో పోటీచేయాలని మరోసారి సూచించారు. దీంతో గంటా శ్రీనివాసరావు మైండ్ బ్లాక్ అయింది. పొమ్మన లేక పొగ పెడుతున్నారని అర్థమైంది. ఈ నేపథ్యంలో గురువారం విశాఖలో తన అనుచరులతో గంటా ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేయనున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ తెలుగుదేశం పార్టీ సానుకూల నిర్ణయం తీసుకోకుంటే.. పార్టీ మారేందుకు సైతం సిద్ధపడతారని సమాచారం. ఇప్పటికే ఆయనకు వైసీపీ నుంచి ఆహ్వానం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన కీలక నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది. మొత్తానికైతే గంటా రాజకీయానికి చంద్రబాబు ఇలా చెక్ చెప్పడం విశేషం. మరి గంటా ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

## ఏపీ కాంగ్రెస్ కు రేవంత్ ఊపిరి పోస్తారా

విశాఖపట్టణం, మార్చి 15,రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు గడ్డు పరిస్థితి ఏర్పడింది. పదేళ్లపాటు అధికారానికి, ప్రజలకు దూరమైంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ కొంచెం పుంజుకోవచ్చని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. అయితే అది సీట్ల దాకా వెళ్తుందని ఎవరూ చెప్పడం లేదు. కాకపోతే గతంలో ఓట్ల శాతాన్ని పెంచుకునే అవకాశం ఉంది. ఎంత పెంచుకుంటందనేదాన్ని బట్టే కాంగ్రెస్ భవిష్యత్ ఆధారపడి ఉంటుందని అనుకోవచ్చు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తిరిగి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పీసీసీ చీఫ్ షర్మిల కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగానే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఏపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. పదహారో తేదీన విశాఖలో బహిరంగసభలో ప్రసంగించనున్నారు. ఆంధ్రప్రదేశ్ అంటే కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అన్న పేరు ఉండేది. కాంగ్రెస్‌ను అమితంగా ఆదరించిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు రాష్ట్ర విభజన తర్వాత దూరం పెట్టారు. విభజన కన్నా ఎ?కకువగా జగన్మోహన్ రెడ్డి సొంత పార్టీ పెట్టుకోవడం కాంగ్రెస్ పార్టీకి ఎక్కువ నష్టం చేసింది. క్యాడర్ అంతా ఆ పార్టీకి వెళ్లిపోవడంతో కాంగ్రెస్ నిర్వీర్యం అయిపోయింది. నవ్యాంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ఇప్పుడు ఉనికిని కాపాడుకోవడమే కష్టంగా మారింది. రాష్ట్ర విభజన అంశం సీమాంధ్ర ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీని తీవ్రంగా దెబ్బ కొట్టింది. మునుపెన్నడూ లేనంత స్థాయిలో ఘోరమైన పరాభవాన్ని 2014 ఎన్నికల్లో ఆ పార్టీ చవిచూసింది. నవ్యాంధ్ర రాష్ట్రంలోని మొత్తం 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఒక్క సీటు కూడా సాధించకపోగా, డిపాజిట్లు కోల్పోయింది. దీంతో పార్టీలోని ముఖ్య నేతలు అందరూ ఇతర పార్టీలకు ఒక్కరు ఒకరుగా వలస పోయారు. దీంతో కాంగ్రెస్ ఖాళీ అయింది. 2019 ఎన్నికల్లో ఆ పార్టీ పోటీ చేసిందా లేదా అన్నది కూడా ఎవరూ పట్టించుకోలేదు. షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టుకున్నారు. కానీ అక్కడ పరిస్థితిలు అంత సానుకూలంగా కనిపించకపోవడంతో కాంగ్రెస్ లో విలీనం చేయాలనుకున్నారు. కానీ ఆమెను తెలంగాణ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించడానికి కాంగ్రెస్ నేతలు అంగీకరించలేదు. ఆమె వల్ల పార్టీ నష్టపోతుందని.. ఆమెకు ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు ఇవ్వాలన్నారు. ఆ ప్రకారం.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన తర్వాత కాంగ్రెస్‌లో చేరిపోయారు షర్మిల. కొద్దిరోజులకే ఏపీ పీసీసీ చీఫ్ గా ప్రకటించడంతో రంగంలోకి దిగారు. వరుసగా పర్యటనలు చేస్తున్నరు. దీంతో మళ్లీ కాంగ్రెస్ పుంజుకుంటుందని ఆశ పడుతున్నారు. షర్మిల ఏపీ బాధ్యతలు తీసుకుంటే తాము పూర్తి స్థాయిలో సహకరిస్తామని రేవంత్ రెడ్డి కూడా హామీ ఇచ్చారు. రెండు సార్లు షర్మి రేవంత్ రెడ్డిని కలిసి.. ఏపీలో పార్టీ బలోపేతంపై చర్చించారు. పదేళ్లపాటు తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొన్న కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో నైనా పుంజుకునేందుకు తన చరిష్మాను ఉపయోగించడానికి సిద్ధమయ్యారు. ఒక్క సీట్ అయినా దక్కించుకొని ఖాతా తెరుస్తుందా అన్న సందేహాలు ?న్నప్పటికీ.. 2014తో పోల్చుకుంటే ఈ ఎన్నికల్లో తమ పార్టీ మంచి పురోగతి సాధించిందని ఆ పార్టీ నేతలు నమ్మకంతో ఉన్నారు. అభ్యర్థులు దొరకని పరిస్థితి నుంచి ఒక్కో స్థానానికి నలుగురైదుగురు అభ్యర్థులు పోటీ పడే స్థాయికి వచ్చామని. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాలకు గాను 13 వందల దరఖాస్తులు అందాయని అంటున్నారు. రాష్ట్ర విభజన తర్వాత ప్రజల నిరాదరణకు గురై ఉనికిని కోల్పోయిన కాంగ్రెస్‌కు తిరిగి పూర్వ వైభవం దక్కుతుందా... రేవంత్, షర్మిల చరిష్మా ఎంతవరకు పనిచేస్తుంది...అన్నది చాలా మందికి అంతుబట్టనివిషయం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విశాఖ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ నెల 16న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రాంగణంలో జరిగే మహాసభలో రేవంత్ రెడ్డి పాల్గొనున్నారు. ఈ వేదిక. సాక్షిగా అధికార ప్రతిపక్ష పార్టీలను ఎండగట్టనున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, వాల్తేరు రైల్వే జోన్, రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశాలను ఎన్నికల ప్రచారాస్త్రాలుగా కాంగ్రెస్ పార్టీ ఎంచుకుంది. ఇప్పటికే పీసీసీ చీఫ్ షర్మిల విమర్శనాస్త్రాలతో ప్రతిపక్షాలపై విరుచుకుపడుతున్నారు. రేవంత్ రెడ్డికి ఏపీలోనూ మంచి ఆదరణ ఉంది. దూకుడు రాజకీయానికి అభిమానులు ఉన్నారు. అయితే ఓట్లు తెచ్చి పెడతాయా అన్నది తేలాల్సి ఉంది.

# 16న టీడీపీ గూటికి మాగుంట



ఒంగోలు, మార్చి 15 ఒంగోలు ఎంపి మాగుంట టిడిపిలో చేరేందుకు ముహూర్తం ఖరారైంది. ఈనెల 16న ఎంపి మాగుంట, ఆయన కుమారుడు మాగుంట రాఘవరెడ్డి ఉండవల్లిలో చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరనున్నారు. రాఘవరెడ్డికి ఒంగోలు పార్లమెంట్ టిడిపి టికెట్ ఇచ్చేందుకు ఇప్పటికే చంద్రబాబు సుముఖత వ్యక్తం చేశారు. నేడో, రేపో టిడిపి రెండో జాబితా వెలువడే అవకాశాలు ఉండటంతో ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని మిగిలిని అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపిక విషయంలో మాగుంట సూచనలను టిడిపి అధిష్టానం పరిగణలోకి తీసుకునే అవకాశాలుఉన్నాయి. టిడిపిలో చేరిన వెంటనే పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన టిడిపి అభ్యర్థులతో మాగుంట సమావేశం కానున్నారు. 2014లో టిడిపి టికెట్‌పై పోటీ చేసి ఓడిపోయిన మాగుంట కుటుంబానికి ఈసారైనా టిడిపి నుంచి గెలుపు సాధ్యమవుతుందా? అన్న చర్చ ఆ పార్టీలో జోరుగా సాగుతోంది. ఈనెల 16న ఉండవల్లిలో టిడిపి అధినేత చంద్రబాబు సమక్షంలో ఎంపి మాగుంట తన కుమారుడు మాగుంట రాఘవరెడ్డితో కలిసి టిడిపి తీర్థం పుచ్చుకోనున్నారు? సరిగ్గా 2014 ఎన్నికల్లో కూడా ఇదే జరిగింది. అప్పట్లో కాంగ్రెస్ ఎంపిగా ఉన్న మాగుంట శ్రీనివాసులురెడ్డి వైసిపి టికెట్‌పై పోటీ చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు? దీంతో విధిలేని పరిస్థితుల్లో టిడిపిలో చేరి బిజెపి-టిడిపి-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ఒంగోలు పార్లమెంట్ నుంచి పోటీ చేసి కేవలం 15 వేల ఓట్ల తేడాతో మాగుంట ఓడిపోయారు? అయితే 2014 ఎన్నికల్లో టిడిపి ఎపిలో అధికారంలోకి రావడంతో మాగుంటను స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీకి దించడంతో ఆయన గెలుపొందారు. ఆ సమయంలో మాగుంటకు మంత్రి పదవి ఇస్తారని ఆశించారు. అయితే చంద్రబాబు మాగుంటకు మంత్రి పదవి ఇవ్వలేదు. అనంతరం 2019 ఎన్నికల్లో మాగుంట తిరిగి వైసిపిలో చేరి ఒంగోలు పార్లమెంట్ నుంచి వైసిపి టికెట్‌పై పోటీ చేసి 2.14 లక్షల భారీ మెజార్టీతో గెలుపొందారు. తిరిగి 2024లో కూడా మాగుంట వైసిపి టికెట్‌పై పోటీ చేసేందుకు చివరివరకు పోరాడారు. అయితే ఆయనకు వైసిపి అధినేత, సియం వైయస్ జగన్ ఈసారి ఎంపి టికెట్ ఇచ్చేందుకు ససేమిరా ఒప్పుకోలేదు. మాగుంట కాంబినేషన్ అయితే ఒంగోలుతో పాటు మరో రెండు మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైసిపి అభ్యర్థులు గెలుపొందే అవకాశాలు ఉన్నాయని భావించిన మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులురెడ్డి మాగుంట కోసం చివరి వరకు పార్టీ అధిష్టానంతో పోరాడారు? అయితే బాలినేని ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఈసారి మాగుంట తనదారి తాను చూసుకున్నారు? ఫిబ్రవరి 28వ తేదిన మాగుంట పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు? అప్పటికే టిడిపి అధినేత చంద్రబాబుతో టచ్లో ఉన్న మాగుంటకు ఈనెల 16వ తేదిన పార్టీలో చేరేందుకు చంద్రబాబు అనుమతి ఇచ్చారు? దీంతో ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, తన కుమారుడు మాగుంట రాఘవరెడ్డితో కలిసి ఉండవల్లిలో చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. 2014 ఎన్నికల్లో వైసిపి టికెట్‌పై ఎంపిగా పోటీ చేసేందుకు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రయత్నించారు. 2009లో కాంగ్రెస్ ఎంపిగా గెలుపొందిన మాగుంట రాష్ట విభజన తరువాత ఏపీలో కాంగ్రెస్ అడ్రస్ గల్లంతు కావడంతో 2014 ఎన్నికలకు ముందు వైసిపిలో చేరేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే వైవి సుబ్బారెడ్డిని పార్లమెంట్ నుంచి పోటీ చేయించేందుకు వైయస్ జగన్ నిర్ణయించుకోవడంతో మాగుంటకు వైసిపిలో ఛాన్స్ దక్కలేదు. దీంతో టిడిపి పార్టీలో చేరిన మాగుంట 2014 ఎన్నికల్లో టిడిపి టికెట్‌పై పోటీ చేసి కేవలం 15 వేల ఓట్ల తేడాతో వైవి సుబ్బారెడ్డిపై ఓడిపోయారు? ఆ తరువాత జరిగిన పరిణామాల్లో భాగంగా 2019 ఎన్నికలకు ముందు వైసిపిలో చేరిన మాగుంటకు వైవి ని కాదని ఎంపి టికెట్ ఇచ్చింది వైసిపి అధిష్టానం? ఈ ఎన్నికల్లో మాగుంట 2.14 లక్షల మెజారిటీతో వైసిపి నుంచి గెలుపొందారు? అప్పటి నుంచి వైసిపిలో ఎంపిగా కొనసాగుతున్న మాగుంట ఈసారి ఎన్నికల్లో తన రాజకీయ వారసుడు మాగుంట రాఘవరెడ్డిని పోటీకి నిలబెడుతున్నట్టు ప్రకటించారు. ఆతరువాత రాఘవరెడ్డి ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఇరుక్కోవడం, బెయిల్‌పై బయటకు రావడం తెలిసిందే. అయితే ఈసారి కూడా మాగుంట కుటుంబానికి వైవి సుబ్బారెడ్డి రూపంలో అడ్డంకి ఎదురైందట?అంతేకాకుండా మరికొన్ని ఇతర కారణాలు కూడా తోడు కావడంతో ఈసారి మాగుంటకు టికెట్ ఇవ్వకుండా వైవి సుబ్బారెడ్డి లేదా ఆయన కుమారుడు వైవి విక్రాంత్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని వైసిపి అధిష్టానం తొలుత నిర్ణయించినట్టు సమాచారం? అయితే అనూహ్య పరిస్థితుల్లో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఒంగోలు ఎంపి అభ్యర్థిగా సియం అధిష్టానం నిర్ణయిచండంతో మాగుంటకు వైసిపిలో దారులు మూసుకుపోయాయి. దీంతో ఇక విధిలేని పరిస్థితుల్లో టిడిపి నుంచి పోటీ చేయడానికి మాగుంట కుటుంబం సిద్ధమైంది. దీంతో మాగుంట కుటుంబానికి 2014 సీన్ రిపీట్ అయినట్టు చెబుతున్నారు.

# అమర్ నాథ్ కు లైన్ క్లియర్

విశాఖపట్టణం, మార్చి 15 ఆంధ్రప్రదేశ్ ఐటీ మంత్రి అమర్‌నాథ్‌కు బెర్త్ ఖాయమైంది. వచ్చే ఎన్నికల్లో మంత్రి పోటీ చేస్తారా? లేదా? అన్న ఉత్కంఠకు తెరపడింది. మంత్రి స్వస్థలం గాజువాక నుంచి అసెంబ్లీ టికెట్ కన్ఫార్మ్ చేసింది వైసీపీ అధిష్టానం.. దీంతో మంత్రి అమర్‌నాథ్ రాజకీయ భవిష్యత్‌పై సందేహాలన్నీ తొలగిపోయాయి. సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుల్లో ఒకరు ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచినా? సీఎం క్యాబినెట్లో బెర్త్ దక్కించుకున్న అమర్‌నాథ్.. రాజకీయ భవిష్యత్‌పై ఇటీవల కాలంలో కొన్ని సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే తాజాగా వైసీపీ అధిష్టానం తీసుకున్న నిర్ణయంతో మంత్రి అమర్‌నాథ్ పొలిటికల్ కెరీర్‌కు లైన్‌క్లియర్ అయినట్లైంది. అనకాపల్లి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న అమర్‌నాథ్‌కు గాజువాక సమన్వయకర్తగా నియమించింది వైసీపీ అధిష్టానం. ఐతే గత మూడు నెలలుగా జరిగిన పరిణామాలు మంత్రి రాజకీయ భవిష్యత్‌పై ఊహాగానాలకు అవకాశమిచ్చాయి. మంత్రి సిట్టింగ్ స్థానం అనకాపల్లి ఇన్‌చార్జిగా మలసాల భరత్‌కుమార్‌ను గతంలో నియమించింది వైసీపీ అధిష్టానం. కానీ, మంత్రికి ఇంతవరకు ప్రత్యామ్నాయం చూపలేదు. వాస్తవానికి మంత్రి కూడా చాలా కాలంగా కొత్త స్థానం వెతుకులాటలోనే ఉన్నారు. ఈ సారి అనకాపల్లి నుంచి పోటీ చేసే ఉద్దేశం మంత్రి అమర్‌నాథ్‌కూ లేకపోయినా? ఆయన ఎక్కడి నుంచి పోటీ చేయాలన్నదానిపై సస్పెన్స్ కొనసాగింది. పెందుర్తి, చోడవరం, అనకాపల్లి ఎంపీ టికెట్ అంటూ రకరకాల ప్రచారం జరిగింది. కానీ, వాటి అన్నిటికీ ఫుల్‌స్టాప్ పెట్టి గాజువాక సీటు కట్టబెట్టింది వైసీపీ హైకమాండ్. గాజువాక సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి బదులుగా ఆ స్థానంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్ వరకూటి రామచంద్రరావును ఇన్‌చార్జిగా నియమించింది వైసీపీ? గత ఎన్నికల్లో జనసేనాని పవన్‌ను ఓడించిన నాగిరెడ్డిని ఈ సారి తప్పించడానికి సామాజిక సమీకరణలే కారణంగా చూపింది. ఐతే ప్రతిపక్షాలను ఢీకొట్టే విషయంలో ప్రస్తుత ఇన్‌చార్జి వరికూటి రామచంద్రారావు సరిపోరనే భావనతో తాజాగా ఆయనను పక్కన పెట్టి ఆ బాధ్యతలు మంత్రి అమర్‌నాథ్‌కు అప్పగించింది. వాస్తవానికి గత మూడు నెలలుగా జరిగిన పరిణామాలతో మంత్రి అమర్‌నాథ్‌కు టికెట్ దక్కదనే ప్రచారం జరిగింది. సీఎం జగన్ కూడా ఇటీవల విశాఖ వచ్చినప్పుడు అమర్‌నాథ్ పోటీపై ఎలాంటి ప్రకటన చేయలేదు సరికదా జిల్లాలో 15 ఎమ్మెల్యే సీట్లు గెలిపించే బాధ్యత అమర్‌దేనంటూ భారం మోపారు. దీంతో తాను సీఎం జగన్ ఏం చెబితే అదే చేస్తానని.. తన భవిష్యత్ సీఎం జగన్‌పైనే ఆధారపడిందని సెంటిమెంట్ రగిలించారు మంత్రి అమర్‌నాథ్. సిట్టింగ్ స్థానం నుంచి తప్పించినా, మూడు నెలలుగా టికెట్‌పై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోయినా, పార్టీకి విధేయుడిగా పనిచేయడంతో మంత్రి అమర్‌నాథ్ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకుంది వైసీపీ అధిష్టానం. ఊహాగానాలను అన్నింటిని పక్కన పెట్టి మంత్రి స్వస్థలం గాజువాక టికెట్ కన్ఫార్మ్ చేసింది. గాజువాక పక్కనే ఉండే మింధిలో అమర్‌నాథ్ సొంత ఇల్లు ఉంది. మంత్రి రాజకీయ జీవితం ప్రారంభించినప్పుడు కూడా ఇదే ప్రాంతంలో కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. ఏవిధంగా చూసినా మంత్రి అమర్‌కు గాజువాక సేఫ్ ప్లేస్ అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అనకాపల్లి నుంచి తప్పించినా, మంత్రి అమర్‌నాథ్ మాత్రం? తనకు ఫలానా సీటు కావాలని అధిష్టానాన్ని అడగలేదని చెబుతున్నారు. అందుకే అమర్ బాధ్యత తనది అని చెప్పిన సీఎం జగన్?. ఇచ్చిన మాట ప్రకారం మంత్రికి పట్టున్న ప్రాంతంలోనే అవకాశమిచ్చారంటున్నారు. మంత్రి అమర్ గెలుపుతోపాటు జిల్లాలోని మిగిలిన స్థానాల గెలుపు బాధ్యతలను మోపారంటున్నారు.

# యువతను మోసం చేసి చంపేశారు...

విజయవాడ, మార్చి 15 : ఏపీ ప్రభుత్వం రాష్ట్ర యువతను మోసం చేసి.. వారి ఆశలు చంపేసిందని టీడీపీ అధినేత చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీపీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ శుక్రవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తమ హయాంలో నిజాయతీ గల వ్యక్తులను ఛైర్మన్ గా నియమించామని.. ఇప్పుడు ఏపీపీఎస్సీ రాజకీయ పునరావాస కేంద్రంగా మారిపోయిందని మండిపడ్డారు. 'ప్రజా సేవ చేయాలని ఎంతో మంది యువత కలలు కంటారు. అందులో భాగంగానే గ్రూప్స్ పరీక్షలను ఎంచుకుంటారు. జగన్ సర్కారు ఏపీపీఎస్సీ ఉద్యోగాలను అమ్మకానికి పెట్టింది. రెండో వాల్యుయేషన్ జరగలేదని కోర్టునే తప్పుదోవ పట్టించేందుకు యత్నించారు. నీతి నిజాయతీ ఉన్న వ్యక్తిని కమిషన్ ఛైర్మన్ గా నియమించాలి. ఆలిండియా సర్వీసులు ఎంత ముఖ్యమో స్టేట్ సర్వీసులూ అంతే ముఖ్యం. ఒకప్పుడు నమ్మకంగా ఉన్న ఏపీపీఎస్సీ ఇప్పుడు అపనమ్మకంగా మారింది. నిక్కచ్చిగా వ్యవహరించిన ఉదయ్ భాస్కర్ ను మెడపడ్డి బయటకు పంపారు. సీఎం జగన్ కు అనుకూలంగా ఉన్న గౌతమ్ సవాంగ్ ను నియమించారు. ప్రస్తుతం కమిషన్ లో అనుభవం లేని వారు ఛైర్మన్ గా, సభ్యులుగా ఉన్నారు.' అంటూ చంద్రబాబు విమర్శించారు. 2018లో జరిగిన గ్రూప్ - 1 పరీక్షల వాల్యుయేషన్ లో అక్రమాలు జరిగాయని చంద్రబాబు మండిపడ్డారు. 'గ్రూప్ - 1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో అవినీతి రాజ్యమేలింది. గౌతమ్ సవాంగ్ ఏపీపీఎస్సీ ఛైర్మన్ అయ్యాక దురాలోచనకు తెరలేపారు. వాల్యుయేషన్ ను దాచిపెట్టి మళ్లీ రెండోసారి చేశారు. రెండో మూల్యాంకనం జరగలేదని కోర్టుకు చెప్పారు. అలా జరిగింది అనడానికి ఆధారాలు ఇస్తున్నాం. డిజిటల్ వాల్యుయేషన్, మాన్యువల్ వాల్యుయేషన్ అంటూ రకరకాలుగా చేశారు. ఓసారి మూల్యాంకనం అయ్యాక రెండోసారి ఎలా చేస్తారు.?. మాన్యువల్ వాల్యుయేషన్ కు వచ్చిన వారి కోసం రూ.20 లక్షలు ఖర్చు చేశారు. ఆవాస రిసార్ట్ కు ఈ మొత్తం చెల్లించినట్లుగా బిల్లులున్నాయి. స్ట్రాంగ్ రూం వద్ద భద్రతకు కర్నూలు నుంచి కానిస్టేబుళ్లను తీసుకొచ్చారు. ఎన్నో ఆశలతో పరీక్షలు రాసిన నిరుద్యోగ యువత పట్ల క్రూర మృగాల కంటే ఘోరంగా వ్యవహరించారు. మూల్యాంకనం ప్రక్రియలో బరితెగించి కోర్టును కూడా తప్పుదోవ పట్టించాలని చూశారు. తాడేపల్లి ప్యాలెస్ పెద్దలకు కావాల్సిన అభ్యర్థుల కోసం అక్రమాలకు పాల్పడ్డారు. అందుకు తగ్గట్టుగా ఛైర్మన్ స్థాయిలో గౌతమ్ సవాంగ్ సహకరించారు. సలాంబాబు, సుధాకర్ రెడ్డి, సుధీర్ వంటి వారిని సభ్యులుగా నియమించారు. పిల్లల జీవితాలు, తల్లిదండ్రుల కలలను నాశనం చేశారు. గ్రూప్ - 1 అభ్యర్థులు చందాలు వేసుకుని న్యాయం కోసం పోరాడారు. ఐదేళ్ల తర్వాత వారికి న్యాయం జరిగింది.' అని చంద్రబాబు పేర్కొన్నారు.

## జీడీపీ గణాంకాలపై అరవింద్ సుబ్రమణియన్ కీలక వ్యాఖ్యలు



కేంద్ర ప్రభుత్వం ఇటీవల వెల్లడించిన జీడీపీ గణాంకాలపై మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. జీడీపీ గణాంకాలు అంతుచిక్కనివిగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఓ వార్త సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తాజా జీడీపీ గణాంకాలు తనకు అర్థం కాలేదని, ఇవి అంతుచిక్కని విధంగా ఉన్నాయని విస్మయం వ్యక్తం చేశారు. ఉదాహరణకు ప్రభుత్వం వెల్లడించిన ద్రవ్యోల్బణ గణాంకాలు 1-1.5 శాతం మధ్య ఉండగా వాస్తవ ద్రవ్యోల్బణం 3-5 శాతం మధ్య ఉంటుందని పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థ 7.5 శాతం వృద్ధి చెందుతుంటే ప్రైవేట్ వినియోగం 3 శాతం వెనుకబడిఉందని గుర్తు చేశారు. తాజా జీడీపీ గణాంకాల ప్రకారం 2024 ఆర్థిక సంవత్సరం మూడో క్వార్టర్‌లో భారత ఎకానమీ 8.4 శాతం వృద్ధి నమోదు చేసింది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి, రెండవ క్వార్టర్లలో వృద్ధి రేటును 8.2, 8.1 శాతంగా సవరించారు. గత రెండు, మూడు క్వార్టర్లుగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) గణనీయంగా తగ్గాయని 2014 నుంచి 2018 వరకూ ప్రధాన ఆర్థిక సలహాదారుగా వ్యవహరించిన అరవింద్ సుబ్రమణియన్ వివరించారు. భారత్ పెట్టుబడుకు అత్యంత ఆకర్షణీయ ప్రదేశమైతే, అధికంగా ఎఫ్‌డీఐ ఎందుకు రావడం లేదనే ప్రశ్న ముందుకొస్తోందని చెప్పారు. కార్పొరేట్ పెట్టుబడులు కూడా 2016 స్థాయిల కంటే దిగువన ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

## సాబకోట సచివాలయంలో ఏసిబి సోదాలు

శ్రీకాకుళం, శ్రీకాకుళం జిల్లా మందస మండలం సాబకోట సచివాలయంలో ఏసిబి అధికారుల మెరుపు దాడుల్లో లంచం తీసుకుంటూ ఇంజనీరింగ్ అసిస్టెంట్ పట్టుబడ్డాడు . సాబకోట గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న కాలనీ హౌసింగ్ బిల్లుల కోసం సింగుపురం గ్రామానికి చెందిన నిమ్మక పరశురాం అనే లబ్దిదారుడి నుంచి రూ. 5000/- లంచం తీసుకుంటూ సాబకోట సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎస్ లోకనాథం ఏసీబి అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. సాబకోట పంచాయతీ సిరిపురానికి చెందిన నిరుపేద లబ్దిదారుడు పరశురాం పునాదుల వరకు ఇంటి నిర్మాణం చేశాడు. హౌసింగ్ స్కీం నుంచి తనకు రావాల్సిన సబ్సిడీ సొమ్ము ను తన ఖాతాలో జమ చేయాలని సాబకోట ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎస్ లోకనాథం ను సంప్రదించాడు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ లోకనాథం లబ్దిదారుడికి హౌసింగ్ బిల్లులు చెల్లించకుండా కాలయాపన చేశాడు. సాబకోట సచివాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగిన పరశురాం కు రూ.5 వేలు లంచంగా ఇస్తే హౌసింగ్ బిల్లులు మంజూరు చేస్తానని ఇంజనీరింగ్ అసిస్టెంట్ లోకనాథం ప్రలోభ పెట్టాడు. అయితే లంచం ఇవ్వటం ఇష్టం లేక పరశు రాం శ్రీకాకుళం లోని అవినీతి నిరోధక శాఖ (ఏసిబి) అధికారులను ఆశ్రయించాడు. ఏసిబి అధికారుల సూచనల మేరకు పరశురాం నుంచి లంచం సొమ్ము రూ. 5 వేలు ఇంజనీరింగ్ అసిస్టెంట్ తీసుకుంటుండగా ఏసిబి డిఎస్పీ బి వి రమణ మూర్తి నేతృత్వంలో సిబ్బంది రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.5 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

## తెదేపా, జనసేన అధిష్టానంపై నేతలె, కార్యకర్తల మండిపాటు

తిరుపతి, తిరుపతిలో ఇప్పటివరకు తెదేపా పార్టీ నాయకులు తమ పార్టీ కోసం ఎంతో కష్టపడ్డామని, కేసులు పెట్టుకున్నామని పార్టీ టికెట్ తమతోనే ఏ ఒక్కరికీ ఇచ్చిన కలిసి కట్టుగా పనిచేయాలని నిర్ణయించుకున్నారు. జనసేనా పార్టీ పొత్తు పెట్టుకున్నప్పటికి ఇరు పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ముందుకెళ్తు పార్టీల కోసం పనిచేస్తున్నారు. తెదేపా అధిష్టానం తిరుపతి అభ్యర్థిగా బిసి కులానికి చెందిన వ్యక్తిని నిలబెట్టాలని అనుకోవడంతొ బలిజ కులంకు చెందిన జే.బి.శ్రీనివాస్ పేరు ముందుకొచ్చింది. అయనను తేదేపా అధినేత చంద్రబాబు పిలిపించి సంప్రదింపులు కూడా చేశారు. పార్టీని ముందుకు తీసుకెళ్ళే నాయకుడని, అన్ని కుల వర్గాల వారిని కలుపుకుపోతారని చంద్రబాబు దృష్టికి సీనియర్ నేతలు తీసుకెళ్లారు. అనంతరం బాబు చేయించిన సర్వేలో కూడా వచ్చింది. తరువాత మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఊకా విజయ్ కుమార్, రెడ్డి వర్గానికి చెందిన మబ్బు దేవనారాయణ రెడ్డి, యాదవ్ కులానికి చెందిన నరసింహ యాదవ్ ఒక్కొక్కరు అధిష్టానాన్ని కలిశారు. గురువారం నాడు తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు 34 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించటంతో అందులో తిరుపతి అభ్యర్థి పేరు లేకపోవడం స్థానిక నాయకులను కలవరపరిచింది. అనంతరం జనసేనా అధినేత పవన్ కళ్యాణ్ తమ పార్టీ తరపున అభ్యర్థి కావాలని తెదేపా అధినేత చంద్రబాబును కోరడంతో వైకాపా పార్టీకి చెందిన చిత్తూరు ఎమ్మెల్యే ఆరణీ శ్రీనివాసులు జనసేనా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. తిరుపతిలోని స్థానిక జనసేనా నాయకులకు, అటు తెదేపా నాయకులకు టికెట్ కరారు చేయకుండా, చిత్తురు స్థానిక వ్యక్తి ఆరణి శ్రీనివాసులు పేరు తిరుపతి అభ్యర్థిగా జనసేనా అధినేత పవన్ కళ్యాణ్‌ప్రకటించటంతో తిరుపతి పట్టణంలోని తెదేపా, జనసేనా పార్టీల నాయకులు,కార్యకర్తలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు. స్థానికేతరులకు కాకుండా లోకల్ గా ఉన్న ఇరు పార్టీలలో ఎవరికి టికెట్ ఇచ్చిన పనిచేస్తామని, లేనిపక్షంలో పూర్తిగా వ్యతిరేకిస్తామని తేల్చి చెప్పారు..

## పార్టీ మార్పు కథనాలపై యనమల స్పందన

తుని,కొన్ని మీడియా ఛానల్స్ లో వచ్చిన కథనాల పై యనమల కృష్ణుడు స్పందించారు. తాను పార్టీ మాడుతున్నట్లు వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు. ఎమ్మెల్యేగా గెలవకపోయినా తుని నియోజకవర్గ ప్రజలకు సేవ చేసుకునే అదృష్టం నాకు కలిగింది. నేను ఏ పార్టీలో కీ వెళ్లడం లేదు నా పై వస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు ఎవరు నమ్మవద్దు. నేను తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతాను. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు కీ వెంటే వుంట.. తుని నియోజకవర్గ తెలుగదేశం పార్టీ గెలుపుకు కృషిచేస్తానని అన్నారు.

## జన సైనికుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన మర్రెడ్డి



బిక్కవోలు శ్రీ ప్రస్థానం ప్రతినిధి:తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం రంగాపురం గ్రామంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు నక్క రమణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం విషయం విధితమే వారి కుటుంబానికి నియోజకవర్గ ఇన్చార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు మరియు మండల మరియు రంగాపురం గ్రామ జనసైనికులు సమకూర్చిన 20వేల రూపాయలు వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి కుటుంబానికి ఏ విధమైన సహాయం కావలసిన వారి పిల్లల చదువు నిమిత్తం వారి కుటుంబానికి జనసేన పార్టీ అండగా ఉంటుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో బిక్కవోలు మండల పార్టీ అధ్యక్షులు ఇందల వీరబాబు ఉపఅధ్యక్షులు కామకు అరుణ్ కుమార్రంగాపురం గ్రామశాఖ అధ్యక్షులు నక్కప్రభుదాస్ ఉపఅధ్యక్షులు తుట్ట వి.వి.ఏస్.ఎన్.కృష్ణ యూత్ అధ్యక్షులు తుట్ట రాంబాబు పితాని దుర్గాప్రసాద్ క నక్కశ్రీను కేతవెంకటరమణ కేతదుర్గాప్రసాద్ అనపర్తి మండల అధ్యక్షులు ఎన్ ఆర్ కే ప్రసాద్ రెడ్డి జనసేననాయకులు యానాల కొండయ్య నూతంగి శ్రీను వడ్లమూరిగోవింద్ రాజు హరీష్ కర్రీశ్రీను సిరిపురపువీరబాబు శివ జనసైనికులు పాల్గొన్నారు

## ప్రైవేట్ వైద్యశాలలకు ధీటుగా సేవలందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం....

### వైద్యాధికారిని గాయత్రి,వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారిని.







నంద్యాల/రుద్రవరం–శ్రీ ప్రస్థానం:–మన రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష, ప్రైవేట్ వైద్యశాలలకు దీటుగా వైద్య సేవలు అందించడమే లక్ష్యమని ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని గాయత్రి తెలిపారు. మండల పరిధిలోని మందలూరు గ్రామ సచివాలయ ఆవరణంలో వైద్యాధికారిని గాయత్రి ఆధ్వర్యంలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్లు మరియు స్త్రీ వ్యాధినిపుణులు గ్రామ సచివాలయ పరిధిలో నుండి వచ్చిన సుమారుగా 415 మందికి వివిధ రకాల వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి అలాగే కంటి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి శ్రీనివాస శర్మ, గ్రామ సర్పంచ్ నిర్మలమ్మ, పంచాయతీ సెక్రెటరీ ఓబులేసు, హెల్త్ సూపర్వైజర్ బాలస్వామి, ఎంపీహెచ్ఏ బాల నరసింహుడు, ఫార్మసిస్ట్ నరసింహారావు, సిహెచ్ఓ లు సుస్మిత, రాజేశ్వరి, హెల్త్ ఎడ్యుకేటర్ రత్నాలు, ఏఎన్ఎమ్ లు, ఆశా కార్యకర్తలు సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, వైఎస్ఆర్సిపి నాయకుడు శ్రీనివాసరెడ్డి,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ముళ్ళ పొదలు తొలగించండి సారు..

దొర్నిపాడు, మార్చి:15, శ్రీ ప్రస్థానం న్యూస్:- మండల కేంద్రమైన దొర్ని పాడు నుండి ఉయ్యాలవాడకు వెళ్లే ఆర్ ఉ బి రహదారికి ఇరువైపులా అడ్డంగా ఉన్న ముల్లపొదలను తొలగించేలా చర్యలు తీసుకోండి సారు అంటూ స్థానిక ప్రజలు అధికారులను కోరారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న కంప చెట్ల వల్ల వాహనాల రాకపోకలు, ఎద్దుల బండ్లు, వ్యవసాయ పనులకు వెళ్ళే కూలీలు సైతం పాదచారలతో వెళ్ళాలన్న తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే దుస్థితి నెలకొందినీ స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఈ రహదారి పై ఉన్న కంప చెట్ల ను తొలగించనీ యెడల నిత్యం ప్రమాదాలు జరిగే అవకాశం లేక పోలేదనీ స్థానికులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి రోడ్డుకు ఇరువైపుల అడ్డంగా ఉన్న కంప చెట్ల ను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరారు..



## పరీక్ష పే చర్చ లో భాగంగా గౌరవ ప్రధాన మంత్రి మోడీతో ప్రశంసల పత్రాన్ని అందుకున్న రుద్రవరం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వర రావు..



Prime Minister
प्रधान मंत्री

New Delhi
फाल्गुन 03, शक संवत् 1945
22 February, 2024

Esteemed Nageswara Rao Sangepu Ji,

It is gladdening that you participated in 'Pariksha Pe Charcha'. The contribution of teachers like you towards ensuring the bright future of the country is immense. Teachers help inculcate values among students that aid the welfare of the nation and society.

In our culture, Gurus and their guidance are of great importance to attain knowledge. In today's rapidly changing times, the role of teachers is to shape the lives of students and inspire them to move ahead. The special bond that is formed when students meet teachers in the classroom, lasts a lifetime, ensuring their progress.

Teachers play a prominent role in developing the interest of students in any subject. Teaching every chapter in a simple, easy, creative and friendly manner, resolving doubts along the way, teachers carve out a special place in the life of the student. It is an onerous responsibility upon a teacher to go beyond the syllabus, make the students comfortable, understand their thoughts and guide them on to the right path.

Teachers not only enhance the knowledge levels of students, but also improve themselves through skilling, reskilling and upskilling.

During the years of the Amrit Kaal, the role of teachers becomes even more important in enhancing the talents of the nation's youth who are rapidly moving towards building a developed India.

I am confident that you and other teachers will continue to make an invaluable contribution in empowering students to work hard and realise their goals while aiding the nation's progress.

With best wishes for your good health and a bright future.

Yours,

(Narendra Modi)

Pariksha Pe Charcha 2024



నంద్యాల/రుద్రవరం–శ్రీ ప్రస్థానం:–పరీక్ష పే చర్చ 2023 కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఢిల్లీ తల్కతోరా స్టేడియంలో విద్యార్థులతో మోడీ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వేలాది మంది ఈ కార్యక్రమాన్ని వర్చువల్‌గా వీక్షించారన్నారు. దీనిలో భాగంగా రుద్రవరం ఆదర్శ పాఠశాల నుండి దాదాపుగా 400 మంది విద్యార్థినీ, విద్యార్థులు అందరూ పరీక్ష పే చర్చ లో వర్చువల్ గా పాల్గొనేలా చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వర రావు మాట్లాడుతూ నాకు ఒక ప్రశంసా పత్రం, మెయిల్ ద్వారా మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పంపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధాన మంత్రి మోడీ మాట్లాడుతూ.. పేరెంట్స్ తమ స్టేటస్ కోసం పిల్లలపై ఒత్తిడి పెట్టొద్దని సూచించారు. ఇక పరీక్ష పే చర్చ తనకు కూడా ఒక పరీక్షేనని ప్రధానమంత్రి అన్నారు. అలాగే కోట్లాది మంది విద్యార్థులు తన పరీక్షకు హాజరవుతున్నారని, ఇందుకు తనకు సంతోషంగా ఉందని తెలిపారు. విద్యార్థులను కేవలం చదువు విషయంలోనే ఒత్తిడి పెంచొద్దని, ఇతర విషయాల్లోనూ వారిని ప్రోత్సహించాలని మోడీ పిలుపునిచ్చారు. విద్యార్థులు తమ సామర్థ్యాలను తక్కువ చేసుకోకూడదని, జీవితంలో టైం మేనేజ్‌మెంట్ అతి ప్రధానమని తెలిపారు. తల్లుల నుంచి టైం మేనేజ్‌మెంట్ నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు.ఇక పరీక్షల్లో కాపీ గురించి కూడా ప్రధాని మాట్లాడుతూ? జీవితంలో పరీక్షలు వస్తాయి పోతాయి, కానీ జీవితాన్ని గడపాలని తెలిపారు. పరీక్షల కోసం షార్ట్‌కార్ట్స్ వెతుక్కోవదన్న మోడీ .. కాపీ చేయడం కంటే చదువుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. కాపీ చేస్తే ఒక్క పరీక్షలో నెగ్గొచ్చు, కానీ జీవితాన్ని నెగ్గలేరు అంటూ విద్యార్థులకు హితబోధ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయ బృందం, నాన్ టీచింగ్ సిబ్బంది విద్యార్థిని విద్యార్థుల అందరి సహకారం ఉండటం వల్ల ఇది సాధ్యం అని అన్నారు.విద్యార్థి దశ, దిశ మారాలి అంటే బాగా చదువుకోని, తల్లి తండ్రులకి గురువు లకి మంచి పేరు తేవాలి అని అన్నారు.గౌరవ ప్రధాన మంత్రి మోడీ గారి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.వారి మాటలు అందరికీ స్ఫూర్తి అని అన్నారు.

## కాడెద్దుల బల ప్రదర్శన విజేతలకు బహుమతులు అందజేత..!

### శ్రీశ్రీశ్రీ బసలింగమ్మ అవ్వ ఆధ్వర్యంలో..!

### వైసిపి నాయకులు హనుమంత్ రెడ్డి, సిపిఎం నాయకులు హనుమంతు..!







శ్రీ ప్రస్థానం ప్రతినిధి భీమన్న రిపోర్టర్ :పెద్ద కడబూరు మండలంలోని బాపురంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ గంగా దేవి రథోత్సవం సందర్భంగా శుక్రవారం పీఠాధిపతులు బసలింగం అవ్వ ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలను ప్రారంభించారు, పోటీలలో మొత్తం 15 జతల కాడెద్దులు పాల్గొన్నాయి, రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి వృషభ రాజముల ప్రదర్శన ఎద్దుల బండ లాగుడు కార్యక్రమం నిర్వహించారు, గెలుపొందిన వృషభ రాజుల యజమానులకు బహుమతులు అందజేశారు, గెలుపొందిన వృషభ యజమానులకు ఆళ్ల మదన్ మోహన్ రెడ్డి కాడెద్దులు 4435.5 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలవగా, బసలింగమ్మ చేతుల మీదుగా, వారికి 26 వేల రూపాయలు అందజేశారు, అడివప్ప కాడెద్దులు 4294.8 అడుగులాగి ద్వితీయ స్థానంలో నిలువగా 20 వేలు రూపాయలు బహుమతి పొందారు, షేరు ఖాన్ పటేల్ కాడెద్దులు, 4294.3 అడుగులు లాగి తృతీయ స్థానంలో నిలచి 15వేలు రూపాయలు నగదు బహుమతి గా అందుకున్నారు, ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు వైఎస్ఆర్సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు,

## ప్రభుత్వ పాఠశాలను ప్రైవేటుకు దీటుగా తీర్చి దిద్దాలి..!

### ఎంఈఓలు సువర్ణ సూనియం, రామ్మూర్తి..!

శ్రీ ప్రస్థానం ప్రతినిధి భీమన్న రిపోర్టర్ : పెద్ద కడుబూరు మండలంలోని బసల దొడ్డి గ్రామం లోని ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలని ఎంఈఓలు సువర్ణ సునియం, రామ్మూర్తి , హెచ్ఎంను ఆదేశించారు, వర్షిక తనిఖీల్లో భాగంగా ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు, రికార్డులు రిజిస్టర్లను పరిశించారు, అలాగే ఉపాధ్యాయులు హాజరు, బోధన పద్ధతులు, పాఠ్య ప్రణాళిక , డైరీలను పరిశీలించారు, ఉపాధ్యాయుల పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరు కావాలన్నారు, ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు,



## ముగిసిన స్కౌట్స్ అండ్ గైడ్స్ ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం

### ---విద్యార్థుల్లో సామాజిక సేవ దృక్పథాన్ని పెంపొందించాలి

### : నంద్యాల జిల్లా సెక్రెటరీ తూర్పు లింగారెడ్డి

నంద్యాల : నంద్యాల జిల్లా గౌరవ విద్యాశాఖ అధికారి శ్రీ కె . సుధాకర్ రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాల పట్టణంలోని శ్యామ కాలువ సమీపాన ఉన్న శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు భారత్ స్కౌట్స్ ఉ గైడ్స్ "వన్డే బిగినర్స్ కోర్స్" నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమము నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్ రెడ్డి డిస్టిక్ చీఫ్ కమిషనర్ అధ్యక్షతన నిర్వహించడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నంద్యాల జిల్లా సెక్రటరీ తూర్పులింగారెడ్డి హాజరై శిక్షణలో పాల్గొన్న ఫిజికల్ డైరెక్టర్స్ మరియు ఉపాధ్యాయులు అందరికీ ఈ ఓరెంటేషన్ ప్రోగ్రాం గురించి దిశా నిర్దేశం చేశారు. అలాగే ఈ శిక్షణా కార్యక్రమానికి అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ నంద్యాల జిల్లా లియో ఆంటోనీగారు పాల్గొని విద్యార్థులకు పాఠశాలల్లో ఏ విధంగా నాయకత్వ లక్షణాలు మరియు ఫస్ట్ ఎయిడ్, మ్యాపింగ్, ఎస్టిమేషన్, ఆర్గనైజేషన్ స్ట్రక్చర్ అండ్ గైడింగ్ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి చెప్పడం జరిగింది. త్వరలోనే కర్నూలు మరియు నంద్యాల జిల్లాలకు చెందిన 100 మందికి 7 రోజుల పాటు "బేసిక్ ట్రైనింగ్" నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఒక్కరోజు శిక్షణలో పాల్గొన్న ఫిజికల్ డైరెక్టర్ లకు ఉపాధ్యాయులకు ముఖ్య అతిథులు చేతుల మీదుగా సర్టిఫికెట్ లు ప్రదానం చేశారు.

## వైఎస్ఆర్సిపి పార్టీ నుండి 50 కుటుంబాలు టిడిపిలోకి చేరిక.

### పార్టీలో చేరిన వారితో భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి.



నంద్యాల/రుద్రవరం–శ్రీ ప్రస్థానం:–మండల పరిధిలోని మందలూరు గ్రామంలో భూమా కిషోర్ రెడ్డి అనుచరులు మరియు వైయస్సార్ పార్టీకి చెందిన 50 కుటుంబాలు శుక్రవారం తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో మందలూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రామశేఖర్ మాట్లాడుతూ నంద్యాల శివ నాగిరెడ్డి, సగిలి శేఖర్ రెడ్డి, బోరెడ్డి గోపాల్ రెడ్డి, మహేష్ రెడ్డిలతో పాటు 50 కుటుంబాలు వైఎస్ఆర్ పార్టీని వీడి భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలోకి చేరడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జగత్ విఖ్యాత్ రెడ్డి మాట్లాడుతూ భూమా నాగిరెడ్డి కుటుంబాన్ని నమ్మి మా వెంట వచ్చిన ప్రతి ఒక్క నాయకుడికి, కార్యకర్తకు తమ కుటుంబం ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆయన భరోసా కల్పిస్తూ పార్టీలోకి చేరిన వారందరినీ సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ జెడ్పిటిసి ఎల్వి రంగనాయకులు, సుద్ధపల్లె చాంద్ బాషా, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలం లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంచాలి

### సిపిఎంపార్టీ డిమాండ్

### మండల కార్యదర్శి శంకర్ నాయక్



అచ్చంపేట రూరల్, మార్చి 15, శ్రీ ప్రస్థానం:నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజ క వర్గం లోని బల్మూరు మండల కేంద్రంలోని గోదల్ వైపుగా వెళ్లే రోడ్డు మార్గం లో ఉన్న ఐదు ఎకరాల భూమి 26 సర్వే నెంబర్ గల ప్రభుత్వ భూమి ని పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం పట్టాల పంపిణీ చేయాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎం. శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. బల్మూరు మండలంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు శుక్ర వారం రోజు నిరసనను తెలియజేస్తూ డిప్యూటీ తాసిల్దార్ కువినతిపత్రాలుఅందజేశారు .ఈ సందర్భంగా శంకర్ నాయక్,మాట్లాడుతూ.తెలుగుదేశం ప్రభుత్వహాయంలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన స్థలాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇల్లు నిర్మాణం చేసుకుంటే నిర్మాణం చేసుకోనివ్వ కుండా అడ్డుకొని ఇచ్చిన ప్లాట్లను రద్దు చేయడందుర్మార్గమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అహంకారానికి తెలంగాణ పేద ప్రజలు బుద్ధి చెప్పారని వారు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఏర్ పడి మూడు నెలలు కావస్తుంది. ఇప్పటికైనా బల్మూర్ మండల కేంద్రంలో గోదల్ రోడ్డు వైపున వెళ్లే మార్గాన ఉన్న ఐదు ఎకరాల భూమిలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు పంచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఐదు లక్షల ఆర్థిక సహాయాన్ని అందించాలని వారు డిమాండ్ చేశారు. పేదలకు ఇండ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు పంచకపోతే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న ఇళ్ల స్థలాల సమస్యను గుర్తించి పెద్ద ఎత్తున పోరాటకార్య క్రమాలు నిర్వహిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు ఎండీ. లాల్ మహమ్మద్ సీనియర్ నాయకులు బాలీశ్వరయ్య, గ్రామ అధ్యక్షులు ఆంజనేయులు సిపిఎం పార్టీ నాయకులు బాబర్ మాసయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సివిల్ హాస్పిటల్ ను ఆకస్మికంగా తనిఖీ

### ఎమ్మెల్యే డా చిక్కుడు వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్ శ్రీ ప్రస్థానం మార్చి 15: నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలంలో శుక్రవారం ప్రభుత్వ హాస్పిటల్ లో రోగులకు అందుతున్న వివరాలు అడిగి తెలుసుకున్న స్థానిక అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ.రోగులకు మెరుగైన వైద్య అందించాలని డాక్టర్లకు నర్సులకు సూచించారు, వైద్య సిబ్బంది అందరూ కూడా సమయపాలన పాటించాలని ఆదేశించారు.



EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757